www.facebook.com/expresstoday/
ఎక్స్‌ప్రెస్‌టుడే
8008038889

ఎక్స్‌ప్రెస్‌టుడే

మహారాజా బ్యాంక్
ది మహారాజా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్.
రిజిష్టర్డు నెం. AMC/VSP/DCO/2004/758 ఫోన్: 0891-2505888, 2721733
బంగారు ఆభరణముల పై గ్రాముకి రూ.8,500/- వరకు
చిన్న పరిశ్రమలకు, చిరు వ్యాపారులకు, గవర్నమెంట్ సెక్యూరిటీలపై,
ఇంటి తనఖా / ఓవరు డ్రాఫ్ట్ ఋణ సదుపాయం కలదు, ఆస్తి తనఖాపై ఋణములు.
ESTD : 1999
Head Office: 47-9-16, 3వ లైను, ద్వారకానగర్, విశాఖపట్నం - 16.

మంగళవారం, 03-11-2026 ప్రచురణ కేంద్రాలు : విశాఖపట్నం, అమరావతి, తిరుపతి సంపుటి-11 సంచిక-144 పేజీలు : 8 రూ.5/-



ముంచుకొస్తున్న ‘మురసు’

తీరం దాటనున్న తీవ్ర తుపాను.. దక్షిణ కోస్తాకు భారీ వర్షసూచన

- 120 కి.మీ వేగంతో ఈదురుగాలులు.. ఆరు ఎన్డీఆర్ఎఫ్, ఏడు ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధం
- ఇప్పటికే పంట నష్టాలతో కుదేలైన రైతులకు మరో దెబ్బ..
- భోగాపురం నుంచి విమాన సర్వీసులు రద్దు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌పై మరో తుపాను పంజా విసరనుంది. అర్నబ్ తుపాను సృష్టించిన నష్టం నుంచి ఇంకా కోలుకోకముందే 'మురసు' తీవ్ర తుపానుగా బలపడి తీరంవైపు దూసుకొస్తోంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇప్పటికే వర్షాలు ప్రారంభమయ్యాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము మధ్య నెల్లూరు-నరసాపురం మధ్య ఒంగోలు సమీపంలో తీరం దాటే అవకాశముందని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్లు, గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం ఉండటంతో తీరప్రాంత జిల్లాల్లో ఆందోళన నెలకొంది.

తీరం వైపు వేగంగా కదలిక

గత ఆరు గంటల్లో గంటకు 22 కిలోమీటర్ల వేగంతో కదిలిన మురసు తుపాను ప్రస్తుతం తీవ్ర తుపానుగా బలపడింది. చెన్నైకి 180 కిలోమీటర్లు, నెల్లూరుకు 160 కిలోమీటర్లు, కావలికి 180 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 240 కిలోమీటర్లు, ఒంగోలుకు 210 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. తుపాను తీరం దాటే సమయంలో సముద్రం అల్లకల్లోలంగా మారడంతోపాటు భారీ ఈదురుగాలులు వీచే అవకాశముంది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

పలు జిల్లాలకు భారీ వర్షసూచన

మురసు ప్రభావంతో సోమ, మంగళవారాల్లో దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలతోపాటు అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, పల్నాడు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అతిభారీ వర్షాలు, అల్లూరి, పోలవరం, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే వీలుందని తెలిపారు. నంద్యాల, వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లోనూ వర్ష ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. ముందస్తు సహాయక చర్యల కోసం ఆరు ఎన్డీఆర్ఎఫ్, ఏడు ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా మొదలైన వర్షాలు

తుపాను తీరం చేరకముందే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం రాత్రి నుంచి నెల్లూరు, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. కాకినాడ నగరంలో వర్షాలతో వీధులు జలమయమయ్యాయి. తునిలో సోమవారం తెల్లవారుజాము నుంచే వర్షం పడుతోంది. అమలాపురం, అంబాజీపేట ప్రాంతాల్లోనూ వర్షాలు నమోదయ్యాయి. కృష్ణా జిల్లాలో చిరుజల్లులు కురుస్తున్నాయి. ఉత్తరాంధ్రలోనూ తుపాను ప్రభావం కనిపిస్తోంది. శ్రీకాకుళం జిల్లాలోని నరసన్నపేట, జి.సిగడాం, సారవకోట, జలుమూరు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో పాలకొండ, విజయనగరం జిల్లాలో చీపురుపల్లి, వేపాడ మండలాల్లో వర్షం పడింది. దీంతో తుపాను ప్రభావంపై ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజల్లోనూ అప్రమత్తత పెరిగింది.

యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన మంత్రి

తుపాను నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా యంత్రాంగాన్ని మంత్రి అచ్చెన్నాయుడు అప్రమత్తం చేశారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, వైద్య సేవలకు అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

రైతుల్లో మళ్లీ కలవరం

తుపాను ప్రభావం కంటే రైతులను ఎక్కువగా కలవరపెడుతున్నది పంటల పరిస్థితి. ఇటీవల అర్నబ్ తుపాను కారణంగా ఇప్పటికే పలు ప్రాంతాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కృష్ణా జిల్లాలో వరితోపాటు మినుము, వేరుశనగ, పత్తి, చెరకు, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. నీట మునిగిన పొలాల నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతున్న రైతులకు మరోసారి భారీ వర్షాల హెచ్చరిక ఆందోళన కలిగిస్తోంది. పొలాల్లో నిలిచిన నీరు పూర్తిగా తొలగకముందే మళ్లీ వర్షాలు కురిస్తే మిగిలిన పంట కూడా చేతికి అందకుండా పోతుందనే భయం వారిని వెంటాడుతోంది. తుపాను ప్రభావం తగ్గే వరకు పంటలను ఎలా కాపాడుకోవాలన్నది రైతులకు ప్రశ్నార్థకంగా మారింది.

భోగాపురంలో విమాన సర్వీసుల రద్దు.. మూడో ప్రమాద హెచ్చరిక

మురసు తుపాను ప్రభావంతో భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముందస్తు చర్యల్లో భాగంగా సోమవారం విజయవాడ, తిరుపతి, హైదరాబాద్ వెళ్లాల్సిన పలు విమాన సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేశారు. వాతావరణం అనుకూలించే వరకు ప్రయాణికులు విమాన సంస్థల నుంచి తాజా సమాచారం తెలుసుకోవాలని విమానాశ్రయ అధికారులు సూచించారు. మరోవైపు కృష్ణపట్నం పోర్టులో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నెల్లూరు జిల్లాలో సోమవారం విద్యాసంస్థలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు.

విద్యుత్ అంతరాయాలపై ప్రత్యేక ఏర్పాట్లు

తుపాను కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఏపీసీపీడీసీఎల్ పలు జిల్లాల్లో ప్రత్యేక నియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. విద్యుత్ సంబంధిత సమస్యలు, అత్యవసర సహాయం కోసం 1912 టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులో ఉంచింది. తెగిపడిన విద్యుత్ తీగలు, నేలకొరిగిన స్తంభాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకవద్దని ప్రజలను హెచ్చరించింది. మొత్తంగా మురసు తుపాను తీరం దాటే సమయం సమీపిస్తుండటంతో తీరప్రాంత ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఒకవైపు భారీ వర్షాలు, మరోవైపు బలమైన ఈదురుగాలుల హెచ్చరికలు.. ఇంకోవైపు ఇప్పటికే దెబ్బతిన్న పంటలు.. వెరసి రాష్ట్రానికి మరో ప్రకృతి పరీక్ష ఎదురవుతోంది. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా ముందస్తు చర్యలు ఎంత సమర్థంగా అమలవుతాయన్నదే కీలకం.

దిల్లీలో గ్రీన్ క్రాకర్స్‌కు ‘సుప్రీం’ అనుమతి

న్యూఢిల్లీ, నవంబర్ 02, ఎక్స్‌ప్రెస్‌టుడే: దీపావళి పండగ నేపథ్యంలో దిల్లీ- ఎన్‌సీఆర్ పరిధిలో గ్రీన్ క్రాకర్స్ కాల్చేందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. నవంబర్ 7, 8వ తేదీల్లో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమే బాణసంచా కాల్చేందుకు అనుమతించాలని అధికారులను ఆదేశించింది. ఆసుపత్రులు, నర్సింగ్ హోంలు, వృద్ధాశ్రమాలు, నోటిఫైడ్ సైలెన్స్ జోన్లకు 300 మీటర్ల పరిధిలో టపాసులు కాల్చొద్దని స్పష్టం చేసింది. బాణసంచా పరిశ్రమలకు గ్రీన్ క్రాకర్ల తయారీకి మాత్రమే అనుమతి ఉందని పేర్కొంది. బేరియం కలిగిన బాణసంచా వాడకం, జూ×=-చీజుజు=× ఆమోదించని గ్రీన్ క్రాకర్లకు అనుమతి లేదని జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ పి.బి.వరాలే ధర్మాసనం పునరుద్ఘాటించింది. అదేవిధంగా దిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో అక్రమ, కాలుష్యకారక టపాసుల దిగుమతులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. గతంలో విధించినట్లుగానే.. దిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో టపాసులపై పూర్తి నిషేధాన్ని నవంబర్ 9 నుంచి తిరిగి అమలు చేయాలని అక్టోబర్ 29 నాటి తమ ఉత్తర్వుల్లో పేర్కొంది. సోమవారం ఈ ఉత్తర్వులు అందుబాటులోకి వచ్చాయి.

మధ్యంతర ఎన్నికల్లో ఓడిపోతే..
‘మిస్టర్ వీటో’గా అవుతా..



న్యూఢిల్లీ, నవంబర్ 02, ఎక్స్‌ప్రెస్‌టుడే: ఇరాన్‌తో అమెరికా యుద్ధం, ప్రపంచ దేశాలతో సంఘర్షణల నేపథ్యంలో యూఎస్‌లో అధికశాతం ప్రజలు అధ్యక్షుడు ట్రంప్ ను వ్యతిరేకిస్తున్నట్లు పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు మెజారిటీ సాధిస్తే.. తాను ‘మిస్టర్ వీటో’గా మారాల్సి రావచ్చని పేర్కొన్నారు. వారి అధికారాలను నియంత్రించేందుకు వీటో పవర్‌ను వినియోగిస్తానన్నారు.

‘‘ఎన్నికల్లో వారు గెలిచి, కాంగ్రెస్‌పై పట్టు సాధిస్తే.. వారు చేసే బిల్లులను ఆమోదించకుండా అన్నింటినీ తిరస్కరిస్తాను. ఒకటి రెండు నెలలపాటు అలా చేస్తే.. చివరికి వారే నా దగ్గరికి వచ్చి ఒప్పందం చేసుకోవాలని చూస్తారు. అయితే.. అవన్నీ వృథా ప్రయత్నాలే అవుతాయి’ అని ట్రంప్ అన్నారు. తన పాలనలో చరిత్రలోనే అత్యుత్తమ ఆర్థిక వ్యవస్థగా అమెరికా ఎదిగిందని పేర్కొన్నారు. రిపబ్లికన్లకు వచ్చే ఓట్లను సర్వేలు సరిగ్గా చూపించట్లేదని అసహనం వ్యక్తం చేశారు. అవకాశం వస్తే మరోసారి అధ్యక్ష స్థానానికి పోటీ చేయడానికీ తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. అయితే రాజ్యాంగ నిబంధనలు కఠినంగా ఉండడం వల్ల అది సాధ్యం కాకపోవచ్చని నిరాశ వ్యక్తం చేశారు.

క్లీన్ , ట్రాఫిక్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ ఉండాలి

- చెత్త సేకరణపై నిర్లక్ష్యం వహించొద్దు 2లో
- అవసరానికి అనుగుణంగా గ్రీన్ ట్యాంకర్లు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

అర్నబ్‌తో పోలిస్తే మురసు తుఫాను తక్కువ తీవ్రత

- దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ వర్షాలకు అవకాశం
- 50 టీఎంసీల మేర వరద ప్రవాహాలు వస్తాయని అంచనా
- సమర్థ నీటి నిర్వహణతో చెరువులు, రిజర్వాయర్లు నింపాలి 2లో
- మురసు తుఫాను సన్నద్ధతపై సీఎం చంద్రబాబు సమీక్ష



కాంగ్రెస్‌ది చొరబాటుదారులను కాపాడే ర్యాలీ

భాజపా మహాపాదయాత్రలో కేంద్ర మంత్రి అమిత్‌షా



హైదరాబాద్ నవంబర్ 02, ఎక్స్‌ప్రెస్‌టుడే: తెలంగాణలో కాంగ్రెస్ సర్కారును గద్దె దించేందుకు సంకల్పం తీసుకోవాలని కేంద్ర మంత్రి అమిత్‌షా భాజపా శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణలో భాజపా సర్కారు రావాలా... వద్దా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని.. అరాచకత్వాన్ని అంతం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో భాజపా మహాపాదయాత్ర సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడారు. అప్పట్లో నిజాం మెడలను సర్దార్ వల్లభాయ్ పటేల్ వంచబట్టే హైదరాబాద్ విముక్తి పొందిందన్నారు.

కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ఓటు బచావో ర్యాలీలపై అమిత్ షా విమర్శలు గుప్పించారు.‘‘ కాంగ్రెస్‌ది ఓటు బచావో ర్యాలీ కాదు.. చొరబాటుదారులను కాపాడే ర్యాలీ. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ఎంత ప్రయత్నించినా చొరబాటుదారులకు ఓటు దక్కనివ్వం. చనిపోయిన వారి ఓట్లు తొలగించాలా.. వద్దా? ఓటరు జాబితాను ప్రక్షాళన -తరువాయి 2లో

రాహుల్.. మీరెప్పటికీ ప్రధాని కాలేరు

ఢిల్లీ : కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఎప్పటికీ ప్రధాన మంత్రి కాలేరని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఒకవేళ ఆయన ప్రధాని కావాలనుకుంటే.. అది మాక్ పార్లమెంటులోనే సాధ్యమవుతుందని ఎద్దేవా చేశారు. చండీగఢ్‌లో రూ.258 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు షా ఆదివారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం ప్రసంగిస్తూ.. సిక్కులపై హత్యాకాండ (1984లో) జరిగిన నవంబరు 1వ తేదీన రాహుల్ 'చలో దిల్లీ' పేరుతో 'జల్సా' ఏర్పాటు చేశారని విమర్శించారు. దీన్ని దేశం ఎన్నటికీ మర్చిపోదని పేర్కొన్నారు. అబద్ధాలు చెప్పడం, అరాచకత్వాన్ని వ్యాప్తి చేయడం, పార్లమెంటు పని చేయకుండా అడ్డుకోవడం.. ఇవే విపక్ష పార్టీల అసలు స్వభావాలంటూ మండిపడ్డారు. "తన కుమారుణ్ని ప్రధాన మంత్రి పీఠంపై కూర్చోబెట్టాలన్న కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా కల నెరవేరడం లేదు. అందుకే వాళ్లు.. మాక్ పార్లమెంటు అనే ఓ కొత్త మార్గాన్ని కనుగొన్నారు. రాహుల్‌కు నేనొక విషయం చెప్పాలనుకుంటున్నా. మీరు ప్రధాని కావాలనుకుంటే జీవితాంతం మాక్ పార్లమెంటులోనే ఉండండి. మీరు ఎప్పటికీ భారత ప్రధానమంత్రి కాలేరు" అని స్పష్టం చేశారు. 'చలో దిల్లీ'ని దీపావళి ముగిసేవరకూ వాయిదా వేసుకోవాలంటూ దిల్లీ వర్తకులు చేసిన విజ్ఞప్తిని విపక్ష ఇండియా కూటమి నేతలు పట్టించుకోకపోవడాన్ని షా తప్పుబట్టారు. దీనివల్ల వచ్చే 3 ఎన్నికల్లో విపక్షాలు దేశ రాజధానిలో ఖాతా తెరవబోవని వ్యాఖ్యానించారు. ఇండియా కూటమి ఆదివారం చేపట్టిన 'చలో దిల్లీ' ర్యాలీని 'మూర్ఖ నాటకం'గా కేంద్ర మంత్రి జె.పి.నడ్డా పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలవలేక.. ఆ అసహనం తోనే రాజ్యాంగబద్ధ సంస్థలను కాంగ్రెస్ లక్ష్యంగా చేసుకుం టోందని భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శించారు. కాంగ్రెస్ 'ఓటు చోరీ' ఆరోపణలపై ఎదురు దాడిలా.. కమల దళం దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. అరాచకత్వాన్ని తొలగించండి' పేరుతో ఆదివారం నిరసన ర్యాలీలు నిర్వహించింది. హరియాణాలోని రోహ్‌తక్‌లో ర్యాలీకి నబీన్ నేతృత్వం వహించారు. 1984 నాటి సిక్కు అల్లర్లకు కాంగ్రెస్, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండు చేస్తూ పశ్చిమ దిల్లీలోని హరినగర్‌లో భాజపా నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఇండియా కూటమి చేపట్టిన 'చలో దిల్లీ' ర్యాలీని అస్తవ్యస్త ప్రదర్శనగా భాజపా పేర్కొంది. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు అక్రమమంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టింది.

ప్రభుత్వ తప్పిదాల వల్లే రాప్తాడు ఘోరం

బెంగళూరు: రాష్ట్రంలో విరివిగా పెరిగిపోయిన మత్తు పదార్థాలే అనంతపురం జిల్లా రాప్తాడు బాలిక ఘటనకు కారణమని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. రాప్తాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన బాలికను బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో వైఎస్ జగన్ పరామర్శించారు. ఈ క్రమంలోనే డాక్టర్లతో మాట్లాడిన వైఎస్ జగన్.. బాలిక ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమెకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను వైఎస్ జగన్ తెలుసుకున్నారు. అనంతరం బాలిక కుటుంబ సభ్యులను కూడా పరామర్శించి, వారికి ఆయన ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ... "ఏకంగా రంపం తీసుకుని స్కూల్లోకి వచ్చి ఇష్టం వచ్చినట్లు ఆడపిల్లల మీద దాడి చేశాడు. స్కూల్లో చదివే పిల్లల పరిస్థితి ఏంటి? ప్రతి గ్రామంలో, ప్రతి వీధిలో విచ్చల విడిగా గంజాయి, బెల్టు షాపులు వెలిశాయి. పిల్లలకు వీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రతి ఊరిలోనూ అవి విస??తృతంగా వ్యాపించాయి. వీటిని అరికట్టే విషయంలో ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయినందుకు తలదించుకోవాలి. స్కూల్లోకి తెలియని వ్యక్తి రావడం.. రంపంతో కోయడం.. అతడు వచ్చినా కూడా ఎవరూ ఆపలేని పరిస్థితిని చూశాం" అని తెలిపారు.

కూటమి ప్రభుత్వం ఆ బాలిక కుటుంబానికి 50 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు వైఎస్ జగన్. "వైద్యానికి పూర్తిగా సాయం అందించాలి. ప్రభుత్వం నుంచి సాయం రాకుంటే వైఎస్సార్‌సీపీ వైద్యం చేయిస్తుంది. అన్ని రకాలుగా తోడుగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం ఇవ్వకపోతే మా ప్రభుత్వం వచ్చాక ఆ బాలిక కుటుంబానికి రూ.50 లక్షలు ఇస్తుంది. వైఎస్సార్‌సీపీ పార్టీకి సంబంధించిన ఆ బాలిక చిన్నాన్న.. మండల కన్వీనర్‌గా ఉన్నారు. ఇంత దారుణంగా రెడ్ బుక్‌ను అమలు చేస్తున్నారు.. కాబట్టే అరాచకాలు జరుగుతున్నాయి. 15-16 నెలల్లో ఇది తొమ్మిదో ఘటన.. కేవలం రాప్తాడులో జరిగింది. ప్రతి గ్రామంలో మద్యం, గంజాయి విచ్చలవిడిగా అందుబాటులో ఉంచుతూ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుపుతున్నారు. దేవుడి దయతో పాప రికవరీ అవుతుందని వైద్యులు చెప్పారు. మనసును కుదుటపర్చే విషయం ఇది" అని వైఎస్ జగన్ తెలిపారు.

'ఓట్ బచావో... దేశ్ బచావో' ర్యాలీ..

న్యూఢిల్లీ: కేంద్రం ఎన్నికల సంఘం నిర్ణయాలు, ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఇండియా కూటమి 'ఓట్ బచావో... దేశ్ బచావో' ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ ర్యాలీ కారణంగా తమకు రూ. 11వేల కోట్ల మేర భారీగా వ్యాపార నష్టం వాటిల్లినట్లు ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ ఆరోపణలు చేసింది. ఈ నష్టానికి బాధ్యత ఎవరు వహిస్తారని, నష్ట పరిహారం ఎవరు చెల్లిస్తారని సీటీఐ ప్రశ్నించింది. ధన్‌తేరస్, దీపావళి పండుగలను పురస్కరించుకుని ఢిల్లీలోని మార్కెట్లు అన్నీ కొనుగోలుదారులతో కళకళలాడాల్సిన కీలక సమయం ఇది. సరిగ్గా ఇదే తరుణంలో కూటమి ఆధ్వర్యంలో ఎన్నికల జాబితాలు, ఈసీఐ విధానాలకు వ్యతిరేకంగా రామ్‌లీలా మైదాన్‌లో భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సభ కారణంగా చాందినీ చౌక్, కరోల్ బాగ్ వంటి ప్రముఖ హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లతో కలిపి సుమారు 2.5 లక్షల దుకాణాలు మూతపడ్డాయని సిటిఐ వెల్లడించింది.తద్వారా ఈ భారీ నష్టం వాటిల్లింది. ఈ భారీ నష్టంపై సీటీఐ చైర్మన్ బ్రిజేష్ గోయెల్ మాట్లాడుతూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పండుగ సీజన్ వ్యాపారాలపై భారీ ప్రభావం పడుతుందని ముందే ఊహించి.. ఈ ర్యాలీని దీపావళి తర్వాత నిర్వహించాలని మేము ప్రతిపక్ష నాయకులను కోరాము. కానీ మా విజ్ఞప్తిని పట్టించుకోలేదు. ఇప్పుడు ఈ భారీ నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారు? ఈ లోటును ఎవరు పూడుస్తారు? ర్యాలీ నిర్వహించిన నిర్వాహకులు నష్టపరిహారం చెల్లిస్తారా? అని నూటిగా ప్రశ్నించారు. మేము బీజేపీకి తొత్తులం కామని, కేవలం వ్యాపారుల సంక్షేమం కోసమే మాట్లాడుతున్నామని స్పష్టం చేశారు. ఢిల్లీకి రావాల్సిన సుమారు 3 నుండి 4 లక్షల మంది కస్టమర్లు, డీలర్లు, సరఫరాదారులు రాలేకపోవడం వల్ల వ్యాపారం పూర్తిగా స్తంభించిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, వ్యాపారుల ఆందోళనలు,ఆరోపణలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ అధికార బీజేపీపై విరుచుకుపడ్డారు. తమ ర్యాలీకి వచ్చే ప్రజలు స్థానికంగా కొనుగోళ్లు చేసుకోవాలని తాము ముందే చెప్పామని, అయితే కన్నాట్ ప్లేస్ ప్రాంతంలో బీజేపీ శ్రేణులే కావాల బలవంతంగా దుకాణాలను మూయించాయని ఆయన ఆరోపించారు.

అర్నబ్‌తో పోలిస్తే మురసు తుఫాను తక్కువ తీవ్రత

అమరావతి, నవంబర్ 02, ఎక్స్‌ప్రెస్‌టుడే: కోస్తాంధ్ర తీరంపై మురసు తుఫాను ప్రభావం తక్కువగానే ఉండే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అర్నబ్ తుఫానుతో పోలిస్తే గాలులు, వర్ష తీవ్రత కూడా తక్కువగానే ఉన్నట్లు అంచనాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తుపాను ప్రభావంతో వచ్చే వర్షాలను సమర్థంగా వినియోగించుకుని చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని సూచించారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అర్నబ్ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికే చాలా వరకు సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని సీఎం తెలిపారు. అర్నబ్ ప్రభావాన్ని ఎదుర్కొనేలా శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు ముందస్తు ఏర్పాట్లు చేశామని, ఇప్పుడు మురసు తుఫాను ప్రభావాన్ని కూడా సమర్థంగా ఎదుర్కోవాలని స్పష్టం చేశారు. అర్నబ్ తుఫాను కారణంగా శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు 31 వేల విద్యుత్ స్తంభాలను క్షేత్రస్థాయికి పంపించామని అధికారులు వివరించారు. మురసు తుఫాను గాలుల ప్రభావం దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లోని సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలపై పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. విద్యుత్ పునరుద్ధరణ కోసం చెన్నై నుంచి మరో వెయ్యి మంది సిబ్బంది వస్తున్నారని, వారిని నెల్లూరు, ప్రకాశం సహా వివిధ జిల్లాల్లో వినియోగించాలని సీఎం సూచించారు.



పల్నాడులో అత్యధిక వర్షపాతం అంచనా

మురసు తుపాను ప్రభావంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లాలో 30 సెంటీమీటర్లు, ప్రకాశంలో 24, మార్కాపురంలో 19, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 9 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. ఏలూరులో 9 సెం.మీ., నెల్లూరులో 9 సెం.మీ. మేర వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయన్నారు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో డ్రెయిన్లను ముందుగానే శుభ్రం చేయాలని, వాగులు, వంకలు పొంగి ప్రవహించే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల పరిధిలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున 30 టీఎంసీల నుంచి 50 టీఎంసీల వరకు నీటి ప్రవాహాలు రావచ్చని అధికారులు అంచనా వేశారు. పులిచింతలలో 18 టీఎంసీల మేర ఫ్లడ్ కుషన్ అందుబాటులో ఉందని, నాగార్జునసాగర్‌కు కూడా భారీగా ప్రవాహాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు 1.5 లక్షల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో రావచ్చని అంచనా వేస్తున్న నేపథ్యంలో నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాల్లో వర్షపాతం లోటు ఉన్నందున చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని ఆదేశించారు. దక్షిణ కోస్తా, రాయలసీమ బేసిన్‌లోని జలాశయాల్లో నీటిని నిల్వ చేసుకునేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. మార్కాపురంలోని కంభం చెరువుతో పాటు ఆయా జిల్లాల్లోని మీడియం, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పరివాహక ప్రాంతాల నుంచి వచ్చే వరద ప్రవాహాలను కంట్రోల్ రూమ్‌ల ద్వారా పర్యవేక్షించాలని సీఎం సూచించారు.

చెరువులకు గండ్లు పడకుండా చర్యలు

మురసు తుఫాను ప్రభావం ఉన్న 6 జిల్లాల పరిధిలోని 6,800 చెరువుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సాగునీటి సంఘాలను క్రియాశీలం చేసి ప్రజల భాగస్వామ్యంతో చెరువుల పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. జలధార కార్యక్రమం కింద చేపట్టిన పనులను వినియోగించుకోవాలని, ఎక్కడా చెరువులకు గండ్లు పడకుండా చూడాలని స్పష్టం చేశారు. డ్రెయిన్లలో పూడిక కారణంగా పంటలు ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తుపాను ప్రభావిత జిల్లాల్లో గర్భిణులను ముందుగానే ఆసుపత్రుల్లో చేర్పించాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే 3,066 మంది గర్భిణీలను తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కచ్చా ఇళ్లలో నివసించే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని, అవసరమైన నిత్యావసర వస్తువులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అవసరాన్ని బట్టి మోహరించాలన్నారు. రైల్వే మార్గాలు, జాతీయ రహదారుల వద్ద లోతట్టు ప్రాంతాల్లో వరద ముప్పు ఉంటే రాకపోకలను నియంత్రించాలని ఆదేశించారు. మత్స్యకారుల బోట్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ప్రతి రెండు గంటలకు బులెటిన్

వర్షాలు, గాలులు, వరద ప్రవాహాలపై నిరంతరం పర్యవేక్షించాలని, సమాచార వ్యవస్థకు అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతి రెండు గంటలకు ఓసారి పరిస్థితిని సమీక్షించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భరోసా కల్పించాలని, కలెక్టర్లు ఎప్పటికప్పుడు హెచ్చరికల ప్రకటనలు విడుదల చేయాలని చెప్పారు. తుఫాను అనంతర పునరుద్ధరణ పనులను 48 గంటల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పంటల బీమా పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్, వ్యవసాయ, జలవనరులు, అగ్నిమాపక సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు వర్చువల్ గా హాజరయ్యారు.

క్లీన్ , ట్రాఫిక్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ ఉండాలి

- చెత్త సేకరణపై నిర్లక్ష్యం వహించొద్దు
- అవసరానికి అనుగుణంగా గ్రీన్ ట్యాంకర్లు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 02, ఎక్స్‌ప్రెస్‌టుడే: మహానగరాన్ని క్లీన్ సిటీగా, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జూబ్లీహిల్స్ నివాసంలో మున్సిపల్ అధికారులతో వివిధ అంశాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. నగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని, చెత్త సేకరణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మున్సిపల్ పరిధిలోని వివిధ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏరియాల్లో చెత్త సేకరణకు ఐలా అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

నగరంలో నిర్మాణ పనులు, పార్కుల నిర్వహణ, ల్యాండ్ స్కేపింగ్, గార్డెనింగ్ తో పాటు ఇతర పనులకు ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ఉద్దేశంతో గ్రీన్ ట్యాంకర్స్ ను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సీఎం అధికారుకు సూచించారు. నిర్మాణ రంగం, గ్రీనరీ మెయింటెనెన్స్, పార్కుల అభివృద్ధి వంటి అవసరాలకు తాగునీటిని ఉపయోగిస్తున్నారని, దీనికి బదులుగా ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించడం ద్వారా తాగునీటిని ఆదా చేయవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. అందుకే జలమండలి తొలివిడతలో 19 మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. జీహెచ్ఎంసీతో పాటు సీఎంసీ, ఎంఎంసీ పరిధిలో గ్రీన్ వాటర్ సరఫరాను మరింత విస్తరించాలని సీఎం సూచించారు.

నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టి ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకురావడానికి అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు నిరంతరాయంగా కొనసాగేలా చూడాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది చొరబాటుదారులను కాపాడే ర్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

చేయాలా.. వద్దా? కోటికి పైగా ఉన్న నకిలీ ఓట్లు తొలగించాలా.. వద్దా? దేశంలో లేని వారి ఓట్లే 3 కోట్లకు పైగా ఉన్నాయి. ఈ చొరబాటుదారుల ఓట్లు తొలగించాలా.. వద్దా? ఎస్ఐఆర్ వల్ల మేము గెలిచామని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. 2014, 2019 ఎన్నికలప్పుడు ఎస్ఐఆర్ లేదు.. అప్పుడు మోదీ గెలవలేదా?ఈవీఎంలు ట్యాంపరింగ్ జరిగితే రేవంత్ రెడ్డి ఎలా ముఖ్యమంత్రి అయ్యారు. కొన్నేళ్లుగా భాజపాకి దేశంలో ఆదరణ పెరుగుతోంది" అని అమిత్ షా అన్నారు.

10 ఏళ్ల పాలనలో రూ.12 లక్షల కోట్ల అవినీతి

ఇండియా కూటమి నిర్వహించిన మాక్ పార్లమెంట్‌పైనా అమిత్ షా విమర్శలు గుప్పించారు. " ఎస్ఐఆర్, ఈవీఎంపై చర్చకు సిద్ధమని హైదరాబాద్ నుంచి సవాల్ విసురుతున్నా. ఈవీఎంల ద్వారా మేము గెలిస్తే.. తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచింది. కేరళ, తమిళనాడులో భాజపాయేతర ప్రభుత్వాలు ఎలా ఏర్పడ్డాయి? కాంగ్రెస్ పార్టీని దేశమంతా ఛీ కొడుతోంది. కాంగ్రెస్ పదేళ్ల పాలనలో రూ.12 లక్షల కోట్ల అవినీతి జరిగింది. కాంగ్రెస్ పార్టీ వెంటిలేటర్‌పై ఉంది. ఇలాంటి పార్టీ మోదీతో పోటీపడుతుందా? అయనతో పరుగుపందెంలో పాల్గొనగలదా? కాంగ్రెస్ అధికారంలో ఉన్న చోట్ల అవినీతి రాజ్యమేలుతోంది.

డ్రగ్స్ రహిత దేశంగా భారత్

తెలంగాణను కాంగ్రెస్ పార్టీ ఏటీఎంగా రేవంత్‌రెడ్డి మార్చారు. ఇక్కడ రాహుల్, రేవంత్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. ఇక్కడి ఆర్ఆర్ ట్యాక్స్ ఎక్కడికి వెళ్తోంది? రాహుల్ కోసమే ఇక్కడ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. కాంగ్రెస్ అవినీతిని ఒవైసీ ఆపుతారా.. బీఆర్ఎస్ ఆపుతుందా? కాంగ్రెస్ అవినీతిని కేవలం భాజపా మాత్రమే ఆపగలదు. త్వరలోనే భారత్‌ను డ్రగ్స్ రహిత దేశంగా మారుస్తాం. మాటిమాటికీ విదేశాలకు పారిపోయేవారు మనకు కావాలా? మేం ఎప్పుడూ పేదలు, రైతులు, యువత పక్షమే ఉంటాం. తెలంగాణలో భాజపా సర్కార్ వచ్చేందుకు మాకు అండగా ఉండాలి." అని అమిత్ షా అన్నారు.

తుఫాను దెబ్బకు కొట్టుకుపోయిన రహదారి!

- సముద్ర కోతతో మత్స్యకారుల ఇళ్లకు ముప్పు
- కోనపైపేటలో భయాందోళనలో తీర ప్రాంత ప్రజలు

కాకినాడ : ఉప్పాడ కొత్తపల్లి: తుఫాను ప్రభావంతో సముద్రం ఉగ్రరూపం దాల్చడంతో కాకినాడ జిల్లా ఉప్పాడ కొత్తపల్లి మండలం కోనపైపేట గ్రామంలో సముద్ర కోత బీభత్సం సృష్టిస్తోంది. అలల తీవ్రతకు తీర ప్రాంత రహదారి కొంతమేర కొట్టుకుపోగా, సముద్రం ముందుకు చొచ్చుకురావడంతో మత్స్యకారుల నివాస గృహాలు సైతం సముద్ర గర్భంలో కలిసిపోతున్నాయి. దీంతో తీర ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

అలల ఉధృతికి ధ్వంసమైన రహదారి

తుఫాను ప్రభావంతో భారీ అలలు ఎగసిపడుతూ తీరాన్ని తాకుతున్నాయి. సముద్రపు నీరు గ్రామం వైపు చొచ్చుకు రావడంతో తీరానికి ఆనుకుని ఉన్న రహ దారి కోతకు గురై కొంతమేర ధ్వంసమైంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడే ప్రమాదం నెలకొంది. సముద్రం క్రమంగా భూభాగంలోకి చొచ్చుకురావడంతో తీర ప్రాంతంలో పరిస్థితి మరింత ఆందోళన కరంగా మారుతోంది.

సముద్రంలో కలుస్తున్న నివాసాలు

సముద్ర కోత ప్రభావం రహదారికే పరిమితం కాకుండా





మత్స్యకారుల నివాసా లకూ విస్తరించింది. తీరానికి సమీపంలో ఉన్న ఇళ్లు అలల తాకిడికి దెబ్బతింటుం డగా, ఇప్పటికే కొన్ని గృహాలు సముద్రంలో కలిసిపోయాయి. దీంతో బాధిత కుటుంబాలు నిలువ నీడ కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచు కొస్తుందోనని స్థానికులు బిక్కుబిక్కు మంటూ కాలం గడుపుతున్నారు.

శాశ్వత రక్షణ చర్యల కోసం విజ్ఞప్తి

తరతరాలుగా సముద్రాన్నే నమ్ముకుని జీవిస్తున్న మత్స్యకార కుటుంబాలకు సముద్ర కోత పెను సమస్యగా మారింది. ఒకవైపు నివాసాలు కోల్పోతుండగా, మరోవైపు రహదారి ధ్వంసం కావడంతో వారి జీవనాధారానికి సైతం ముప్పు ఏర్పడుతోంది. అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి, ప్రమాదకర ప్రాంతాల్లోని కుటుంబాలకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. సముద్ర కోతను అరికట్టేందుకు రక్షణ గోడలు, బలమైన తీర రక్షణ నిర్మాణాలు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

యోగాలో రెండో పీహెచ్‌డీ సాధించిన డాక్టర్ తారక రామారావు

- ఇంజినీరింగ్ విద్యార్థుల జీవన నాణ్యతపై యోగా ప్రభావంపై పరిశోధన



ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం యోగా, ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా (సి) పనిచేస్తున్న డాక్టర్ కె. తారక రామారావు యోగాలో పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఇప్పటికే సైకాలజీలో డాక్టరేట్ పొందిన ఆయన తాజాగా యోగాలోనూ పరిశోధన పూర్తి చేసి రెండో పీహెచ్‌డీని తన ఖాతాలో వేసుకున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థుల జీవన నాణ్యతను మెరుగుపరచడంలో యోగా మాడ్యూల్ ప్రభావం అనే అంశంపై ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. ఏయూ యోగా విభాగాధిపతి ప్రొఫెసర్ కె. రమేశ్‌బాబు పరిశోధన పర్యవేక్షకుడిగా వ్యవహరించారు. గతంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచే సైకాలజీలో డాక్టరేట్ పొందిన తారక రామారావు, తాజాగా యోగాలోనూ పీహెచ్‌డీ సాధించడం విశేషం. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ కె.ఆర్. రజని, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. అడ్డయ్య, అధ్యాపకులు, సిబ్బంది, పరిశోధకులు ఆయనకు అభినందనలు తెలిపారు.




ఖేలో ఇండియా పోటీలకు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో కూడిన శాశ్వత ఏర్పాట్లు చెయ్యాలి

హైదరాబాద్,నవంబర్,2: ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించిన అన్ని వనరులను ఖేళో ఇండియా 2026 పోటీలకు సైతం ఉపయోగించుకునేలా సమాంతరంగా ఖేళో ఇండియా పోటీల ఏర్పాట్లు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 8వ ఎడిషన్ క్రీడల పోటీల నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ పోటీలకు ఎక్కడా ఏర్పాట్లలో నాణ్యతా ప్రమాణాల లోపం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. మంత్రులు జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డిలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణ క్రీడా విధానం, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే క్రీడల హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో ఈ పోటీలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే దీర్ఘ కాలిక లక్ష్యంగా అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, ప్రపంచస్థాయి క్రీడా శిక్షణను తెలంగాణ యువ క్రీడాకారులకు అందించేందుకు ఈ పోటీలు ఒక గొప్ప అవకాశంగా మలుచుకోవడం ప్రభుత్వ ఉద్దేశమని ఈ సందర్భంగా సీఎం అన్నారు.

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించిన అన్ని వనరులను ఖేళో ఇండియా పోటీలకు సైతం ఉపయోగించుకునేలా సమాంతరంగా ఖేళో ఇండియా పోటీల ఏర్పాట్లు చెయ్యాలని సీఎం సూచించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ లో క్రీడలు, క్రీడాభివృద్ధికి సంబంధించిన పెట్టుబడుల ఆకర్షణ కూడా ఒక భాగం అయినందున అధికారులందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి వారిని అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలన్నారు. అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలను తీర్చిదిద్ది ఖేళో ఇండియా పోటీల తర్వాత కూడా అవి గొప్ప క్రీడా వనరులుగా ఉపయోగపడేలా చూడాలన్నారు.ఏర్పాట్లలో నాణ్యతా ప్రమాణాల లోపం లేకుండా పటిష్ట చర్యలు తీసుకునే విధంగా గ్రూప్-1 స్థాయి అధికారులకు ఏర్పాట్ల నుంచి క్రీడలు ముగిసే వరకు పర్యవేక్షణా బాధ్యతలు అప్పగించాలన్నారు. వివిధ జిల్లాల్లో జరగనున్న పోటీలకు సంబంధించి ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం ఆయా చోట్ల స్థానికంగా పనిచేస్తున్న ట్రైనీ అధికారులు, గ్రూప్-1 అధికారులను నియమించాలన్నారు. క్రీడాకారులకు ఆహారం, వసతి సౌకర్యాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రతి వారం ఏర్పాట్ల పురోగతిపై సమాచారమివ్వాలన్నారు. కాగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రీడా పోటీల్లో జరిగిన పరిణామాలు నివృత్తి కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వ పాలనలో క్రీడలకు కొన్ని చోట్ల చేపట్టిన మౌలిక సదుపాయాల పనులు క్రీడా పోటీలు ముగిసిన కొన్నేళ్ళలోనే విచ్ఛిన్నం అయ్యాయని గుర్తు చేశారు.

ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో క్రీడా పోటీల ప్రారంభ, ముగింపు వేడుకల్లో అనవసరమైన ఆడంబరాలకు తావు లేకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు.డిసెంబరు 11 నుంచి 22 వరకు జరిగే ఖేలో ఇండియా క్రీడా పోటీలకు దేశవ్యాప్తంగా వేలాది మంది యువ క్రీడాకారులు పాల్గొననున్నారు. ఏడు వేలకు పైగా యువ క్రీడాకారులతో పాటు సుమారు రెండు వేల మంది కోచింగ్ సిబ్బంది, అధికారులు రాష్ట్రానికి రానున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ సహా 6 నగరాల్లో 20 చోట్ల 27 రకాల క్రీడా పోటీలు, ఒక డెమో పోటీ నిర్వహించనున్నారు. తెలంగాణ కర్రసాము క్రీడను కూడా ఆతిథ్య రాష్ట్ర కోటాలో ఖేలో ఇండియా క్రీడల్లో చేర్చే విధంగా వెంటనే కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు.

ఈ పోటీల్లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు సత్తా చాటే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు తెలిపారు. ఇప్పటికే వివిధ జిల్లాల్లో ఖేలో ఇండియా శిబిరాల్లో క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. వివిధ క్రీడల పోటీల నిర్వహణ కోసం 20 వేదికల్లో చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులు వివరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు కె. రామకృష్ణ రావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ (స్పోర్ట్స్) వాణీ ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనిబాలా దేవి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



పుర పోరులో కూటమి పైచేయి?

» వైసీపీకి అగ్నిపరీక్ష.. » కంచుకోటలపైనే ఆశలు!

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థలు, కార్పొరేషన్ల ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఓటర్లు తమ తీర్పును బ్యాలెట్ పెట్టెల్లో భద్రపరిచారు. ప్రధాన అభ్యర్థుల రాజకీయ భవితవ్యం ఇప్పుడు ఓట్ల లెక్కింపుపైనే ఆధారపడి ఉంది. క్షేత్రస్థాయి పరిస్థితులు, పోలింగ్ సరళిపై వినిపిస్తున్న విశ్లేషణలను పరిశీలిస్తే.. ఈ పోరులో అధికార ఎన్డీయే కూటమి ఆధిక్యం ప్రదర్శించిందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. కూటమి శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించ డంలో చురుకుదనం ప్రదర్శించగా.. వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో మాత్రం ఆశించిన స్థాయి ఉత్సాహం కనిపించలేదనే చర్చ సాగుతోంది.

పోటీకి ముందే సందిగ్ధం!

అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత వైఎస్సార్‌సీపీ కేడర్‌లో నెలకొన్న నిరాశ ఈ పుర ఎన్నికల్లోనూ ప్రభావం చూపినట్లు కనిపిస్తోంది. ఆర్థిక ఇబ్బందులు, న్యాయపరమైన ఒత్తిళ్లు, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో స్థానిక నేతలు ఎన్నికల్లో పోటీకి దిగేందుకు తొలుత వెనుకాడినట్లు తెలుస్తోంది. అయితే పార్టీ ఉనికిని కాపాడుకోవడంతో పాటు కేడర్ చేజారకుండా చూడాలంటే ఎన్నికల బరిలో నిలవాల్సిందేనని అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో నేతలు పోటీకి సిద్ధమయ్యారు. బరిలో నిలిచినా.. గెలుపే లక్ష్యంగా అవసరమైన స్థాయిలో ఎన్నికల నిర్వహణ, నిధుల సమీకరణ, ప్రచార వ్యూహాలపై దృష్టి సారించలేకపోయారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికార కూటమి యంత్రాంగంతో పోలిస్తే వైసీపీ ఎన్నికల సన్నద్ధత బలహీనంగా కనిపించిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

ఒత్తిళ్ల మధ్య స్థానిక నాయకత్వం!

నామినేషన్ల దశ నుంచే పలు ప్రాంతాల్లో వైసీపీ నాయకత్వానికి అనేక ఇబ్బందులు ఎదురైనట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అభ్యర్థులకు సహకారం, ప్రచార నిర్వహణ, ఆర్థిక వనరుల సమీకరణ వంటి అంశాల్లో సమన్వయ లోపాలు పార్టీకి ప్రతికూలంగా మారినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలన్నీ కలిపి పుర ఎన్నికల్లో వైసీపీ విజయావకాశాలను దెబ్బతీసే ప్రమాదం ఉందనే అంచనాలు వెలువడుతున్నాయి. అయితే రాయలసీమలోని సంప్రదాయ బలమైన ప్రాంతాలు, కడప, పులివెందుల వంటి నియోజకవర్గాలతో పాటు ఉమ్మడి జిల్లాల్లోని తమ పట్టున్న ప్రాంతాలు, పట్టణ పేద వర్గాల ఓటు బ్యాంకుపై వైసీపీ ఆశలు పెట్టుకుంది. గణనీయమైన స్థానాలు సాధించలేకపోయినా కనీస స్థాయిలో ప్రాతినిధ్యం దక్కితే పార్టీకి రాజకీయంగా కొంత ఊరట లభిస్తుందని అధిష్ఠానం భావిస్తోంది. కానీ ఫలితాలు పూర్తిగా ప్రతికూలంగా వస్తే ఇప్పటికే నిరుత్సాహంలో ఉన్న కేడర్ మరింత ఆత్మరక్షణ ధోరణిలోకి వెళ్లే ప్రమాదం ఉంది.

కంచుకోటలే కొండంత అండ!

ఈ పుర ఎన్నికలు కేవలం మున్సిపల్ పీఠాల కోసం జరుగుతున్న పోరుగా మాత్రమే చూడలేం. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత వైసీపీ క్షేత్రస్థాయి బలాన్ని అంచనా వేసేందుకు ఇవి ఒక కీలక పరీక్షగా మారాయి. పార్టీకి ఇంకా ప్రజల్లో ఆదరణ ఉందా? స్థానిక నాయకత్వం ఎంతవరకు నిలదొక్కుకుంది? కేడర్‌లో ఉత్సాహం తిరిగి వచ్చిందా? అనే ప్రశ్నలకు ఫలితాలు సమాధానం ఇవ్వను న్నాయి. ఒకవేళ వైసీపీ అంచనాలకు మించి స్థానాలు సాధిస్తే.. పార్టీ పట్ల ప్రజాదరణ పూర్తిగా తగ్గలేదనే సంకేతం వెళ్లే అవకాశం ఉంది. అది నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపవచ్చు. కష్టకాలంలో పార్టీకి రాజకీయంగా కొంత ఊపిరి పోయవచ్చు. అందుకే ఈ ఎన్నికల్లో కంచు కోటల ఫలితాలపై వైసీపీ అధిష్ఠానం ప్రత్యేక ఆశలు పెట్టుకుంది.

కూటమి ధీమాకు ఫలితాలే కొలమానం!

మరోవైపు అధికార ఎన్డీయే కూటమి పుర ఎన్నికల్లో ఘన విజయాలు సాధించి తన ఆధిపత్యాన్ని మరింత బలపరుచుకోవాలని చూస్తోంది. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన, పట్టణ ప్రాంతాల్లో చేపట్టిన చర్యలు తమకు అనుకూలంగా మారతాయని కూటమి నేతలు విశ్వసిస్తున్నారు. ఎన్నికల సమయంలో కూటమి పార్టీల మధ్య సమన్వయం కూడా తమ విజయావకాశాలను పెంచిందని భావిస్తున్నారు. మొత్తానికి ఈ పుర ఎన్నికల ఫలితాలు అధికార కూటమికి విజయోత్సాహాన్ని అందిస్తాయా? లేక వైసీపీకి రాజకీయంగా పుంజుకునే అవకాశాన్ని కల్పిస్తాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. నవంబర్ 3న వెలువడనున్న ఫలితాలు కేవలం పురపాలక పీఠాల విజేతలను మాత్రమే నిర్ణయించవు. రాష్ట్ర రాజకీయాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల బలాబలాలపై కూడా కొత్త అంచనాలకు తెరతీయనున్నాయి. వైసీపీకి ఇవి మనుగడ పోరులో ఊరటనిస్తాయా? కూటమికి తిరుగులేని ఆధిక్యాన్ని అందిస్తాయా? అన్నది తేలడానికి మరికొద్ది గంటలే మిగిలాయి.

సముద్ర కోతపై కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలన

ఉప్పాడ బీచ్ రోడ్డుకు జరిగిన నష్టంపై ఆరా.. రక్షణ చర్యలపై వివరాల సేకరణ

ఉప్పాడ: కాకినాడ జిల్లా ఉప్పాడ తీర ప్రాంతాన్ని వేధిస్తున్న సముద్ర కోత సమస్యపై కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టింది. సముద్రపు అలల ఉద్ధృతికి తీవ్రంగా దెబ్బతిన్న బీచ్ రోడ్డును బృంద సభ్యులు పరిశీలించి, నష్ట తీవ్రతను అంచనా వేసే దిశగా వివరాలు సేకరించారు. ఉప్పాడ శివారు సుబ్బంపేట, కొత్తపట్నం సమీపంలో సముద్రపు అలల తాకిడికి కోతకు గురైన రహదారిని బృందం నిశితంగా పరిశీలించింది. అలల ఉద్ధృతితో రహదారి ఏ మేరకు దెబ్బతింది? తీరప్రాంతంలో కోత తీవ్రత ఎలా ఉంది? అనే అంశాలను క్షేత్రస్థాయిలో గమనించింది. సముద్రం ముందుకు చొచ్చుకురావడంతో రహదారికి ఏర్పడిన నష్టాన్ని, తీరప్రాంతంలో నెలకొన్న పరిస్థితులను పరిశీలించి సంబంధిత వివరాలను నమోదు చేసుకుంది. సముద్ర



కోత ప్రభావంతో తీరప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, రహదారి భద్రతకు పొంచి ఉన్న ముప్పు, భవిష్యత్తులో కోత తీవ్రతను నియంత్రించేందుకు చేపట్టాల్సిన రక్షణ చర్యలపై బృందం దృష్టి సారించింది. తీరప్రాంతాన్ని కాపాడేందుకు అవసరమైన శాశ్వత పరిష్కార మార్గాలను పరిశీలించే ఉద్దేశంతో ఈ పర్యటన సాగింది. ఏళ్లుగా సముద్ర కోత సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉప్పాడ తీర ప్రాంతానికి కేంద్ర బృందం పర్యటనతోనైనా పరిష్కారం లభిస్తుందా? దెబ్బతిన్న బీచ్ రోడ్డుకు రక్షణ కల్పించడంతోపాటు తీం ప్రాంతాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపడతారా? అన్నది స్థానికుల్లో చర్చనీయాంశంగా మారింది. కేంద్ర బృందం సేకరించిన వివరాల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని స్థానికులు ఆశిస్తున్నారు.

వేటకు వెళ్లి సముద్రంలో చిక్కుకున్న మత్స్యకారులు



సర్వేపల్లి: 'మురసు' తుపాను ప్రభావంతో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో తీరప్రాంతం అల్లకల్లోలంగా మారింది. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు జువ్వలదిన్నె తీరంలో చిక్కుకున్నారు. అలల తాకిడి ఎక్కువగా ఉండటంతో తీరానికి 5 కి.మీ. దూరంలో లంగరు వేసుకుని ఉండిపోయారు. బోటులో ఏడుగురు మత్స్యకారులు చిక్కుకుపోయిన విషయంపై స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. వారిని ఒడ్డుకు చేర్చేందుకు స్థానిక మత్స్యకారుల సహకారంతో అధికారులు చర్యలు చేపట్టారు. అనంతరం వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. బోటును సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంలో అప్రమత్తంగా వ్యవహరించిన మత్స్యశాఖ అధికారులతో పాటు మత్స్యకారులను జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా అభినందించారు.

'జనశతాబ్ది'కి సూపర్‌ఫాస్ట్ హోదా రద్దు..

తిరువనంతపురం: కేరళలో ప్రయాణించే జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సంబంధించి భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రెండు జనశతాబ్ది రైళ్లకు ఉన్న సూపర్‌ఫాస్ట్ హోదాను తొలగించనుంది. ఈ మార్పులు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. దీంతో ప్రయాణికులకు టికెట్ ధరలు తగ్గనున్నాయి. కన్నూర్-తిరువనంతపురం-కన్నూర్ (12081/12082), కోజికోడ్-తిరువనంతపురం-కోజికోడ్ (12075/12076) జనశతాబ్ది రైళ్లను సూపర్‌ఫాస్ట్ కేటగిరీ నుంచి సాధారణ ఎక్స్‌ప్రెస్ కేటగిరీలోకి మార్చనున్నారు. ఈ క్రమంలో రైళ్ల నంబర్లు కూడా మారనున్నాయి. సాధారణంగా సూపర్‌ఫాస్ట్ రైళ్లు గంటకు సగటున 55 కిలోమీటర్లు లేదా అంతకంటే ఎక్కువ వేగంతో ప్రయాణించాల్సి ఉంటుంది. వేగం తగ్గిన రైళ్ల పనితీరును పరిశీలించిన అనంతరం రైల్వే శాఖ వాటి హోదాను మారుస్తుంది. ఇటీవల దేశవ్యాప్తంగా సుమారు 10 రైళ్లకు సూపర్‌ఫాస్ట్ హోదాను తొలగించింది.

మురసు తుపాను.. అప్రమత్తంగా ఉండాలి



అమరావతి: మురసు తుపాను నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో సమీక్షించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా జిల్లాలపై తుపాను తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని పవన్ అన్నారు. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. అత్యంత భారీ వర్షాల హెచ్చరికలు ఉన్న ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేయాలని.. లోతట్టు ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వాగులు, వంకల సమీపంలో జన సంచారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలను వీలైనంత త్వరగా పునరుద్ధరించేలా సమన్వయం చేసుకోవాలి పవన్ దిశానిర్దేశం చేశారు. తుపాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని ప్రజలకు సూచించారు.

మోదీ, షా తప్పించుకోలేరు

న్యూఢిల్లీ : ఓట్ చోరీ ఆరోపణల నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ సర్కార్‌ను గద్దె దించాలని విపక్ష ఇండియా కూటమి పిలుపునిచ్చింది. ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన బహిరంగ సభలో ఓటుచోరీపై విపక్షాలు గళమెత్తాయి. కేంద్రంతో కుమ్మక్కైన సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పౌరుల ఓట్లను అపహరించారని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి తాము పోరాటం చేస్తామని నేతలు ప్రతిజ్ఞ చేశారు. భవిష్యత్‌లో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి దేశద్రోహం కేసుల్లో జైలుకు పంపుతామని, అలాగే ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాలు కూడా ఈ కేసు నుంచి తప్పించుకోలేరని కార్యక్రమంలో ప్రసంగించిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రజా తీర్పు దొంగిలించి కేంద్రంలోనూ, పలు రాష్ట్రాల్లో బీజేపీ అధికారాన్ని చేపట్టిందని విమర్శించారు. 'నరేంద్ర మోదీ, అమిత్ షా ఒక విషయాన్ని గుర్తుంచుకోండి. మీరు చేసిన ఓట్ల చోరీకి సంబంధించి మీపై చర్యలుంటాయన్న సంగతిని మరువొద్దు. జ్ఞానేశ్ కుమార్ తర్వాత మీపైనే మా గురి' అని ఆయన అన్నారు.

రాబోయే మార్పునకు సూచిక : అశేష ప్రజానీకంతో రామ్ లీలా మైదానం ప్రజాస్వామ్యానికి సంబంధించిన 'హల్దీఘాటీ యుద్ధభూమి'గా మారిందని, ఇది రాబోయే మార్పునకు సూచిక అని ఎస్పీ అధినేత అఖిలేశ్ పేర్కొన్నారు. సీజేపీ నాయకత్వానికి, జెన్‌జీ ఆందోళనకు తాను మద్దతు ఇస్తున్నట్టు మాజీ సీఎం మమతా బెనర్జీ తెలిపారు. బెంగాల్‌లో ఎన్నికలను అపహరించారని ఆరోపించారు.

బీజేపీ కౌంటర్ ర్యాలీలు

న్యూఢిల్లీ: రాజధాని ఢిల్లీలో ఇండియా కూటమి నిర్వహించిన ర్యాలీకి పోటీగా బీజేపీ దేశవ్యాప్తంగా 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. అరాచకాన్ని తరిమికొట్టండి' పేరుతో నిరసన ప్రదర్శనలు చేపట్టింది. ఢిల్లీలో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి నేతృత్వంలో హరి నగర్ నుంచి తిలక్ నగర్ వరకు ర్యాలీ నిర్వహించారు. దీనిలో 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధిత కుటుంబాలు సహా సుమారు ఐదు వేల మంది పాల్గొన్నారు. నవంబర్ ఒకటిన రాజకీయ ర్యాలీ నిర్వహించడం ద్వారా కాంగ్రెస్ సిక్కుల గాయాలను మళ్లీ గుర్తు చేస్తున్నదని బీజేపీ నేతలు విమర్శించారు. బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ హర్యానాలోని రోహతక్ ర్యాలీకి నాయకత్వం వహించారు. 1984 అల్లర్ల బాధితులకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జేపీ నడ్డా మాట్లాడుతూ సిక్కు బాధితులను గుర్తు చేసుకోవాల్సిన రోజున రాహుల్ గాంధీ రాజకీయ ప్రయోజనాల కోసం ర్యాలీని నిర్వహిస్తున్నారని ఆరోపించారు.

నకిలీ రూ. 20 నాణేల ముఠా గుట్టురట్టు

న్యూఢిల్లీ: నకిలీ రూ.20 నాణేల తయారీ, సరఫరా చేస్తున్న ముఠాను ఢిల్లీ పోలీసులు ఛేదించారు. సూత్రధారి సహా నలుగురిని అరెస్టు చేశారు. సుమారు లక్ష రూపాయల విలువైన నకిలీ రూ.20 నాణేలను స్వాధీనం చేసుకున్నారురు. ముండ్కా ఇండ్రస్టియల్ ఏరియా మెట్రో స్టేషన్ సమీపంలో నాణేల పంపిణీ సమాచారం మేరకు ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఆపరేషన్ నిర్వహించారు. ఒక కారును అడ్డగించిన పోలీసులు వెనుక సీటులోని బ్యాగ్‌లో 50 పాలిథీన్ సంచుల్లో ప్యాక్ చేసిన రూ.5,000 విలువైన నకిలీ రూ.20 నాణేలను స్వాధీనం చేసుకున్నారు. వాహనం నడుపుతున్న పారస్ జైన్‌ను అరెస్టు చేశారు. సోనిపట్‌లో తయారీ యూనిట్ నిర్వహిస్తున్న ఉప్‌కార్ లూథ్రా అలియాస్ అభయ్ ప్రతాప్ సింగ్ నుంచి రూ.లక్ష విలువైన నాణేలను రూ.70వేలకు కొనుగోలు చేసినట్లు జైన్ వెల్లడించారు. విచారణ అనంతరం, లూథ్రాతోపాటు అనురాగ్ పాల్ అలియాస్ లంకేష్, జనార్దన్ కుమార్ చౌరాసియా అలియాస్ సంతోష్ లను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు ప్రస్తుతం జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ నెట్‌వర్క్‌లోని ఇతర సభ్యులను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోంది.

ఆధారాల్లేకుండా రీ పోలింగ్‌కు ఎలా ఆదేశిస్తాం?



అమరావతి: 'ఎన్నికల సంఘం ఎప్పుడూ తటస్థంగానే ఉంటుంది. రీ పోలింగ్ కోసం ఆదేశాలివ్వాలంటే తగిన ఆధారాలు, కలెక్టర్, ఎస్పీల నుంచి నివేదికలు ఉండాలి కదా? ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఎవరైనా హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్తే ఏం సమాధానం చెప్పాలి? ఆధారాల్లేకుండా రీ పోలింగ్‌పై ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేం' అని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా స్పష్టం చేశారు. 'అనంతపురం, పల్నాడు జిల్లాల్లో జరిగిన కొన్ని ఘటనలపైనా ప్రిసైడింగ్ ఆఫీసర్ (పీఓ) నివేదికలు, వెబ్‌కాస్టింగ్ ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుంటాం. తటస్థంగా వ్యవహరిస్తున్నందునే మాకు వ్యతిరేకంగా పార్టీలు ఫిర్యాదులు చేస్తున్నాయి. వాటిలో తెదేపా కూడా ఉంది కదా?' అని ఆయన వ్యాఖ్యానించారు. ఆదివారం సాయంత్రం పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ముగిశాక కార్యదర్శి మల్లికార్జున, ఐజీ రాజకుమారితో కలిసి ఎస్ఈసీ పునేఠా విలేకర్లతో మాట్లాడారు. 'పట్టణ స్థానిక సంస్థల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కొన్ని జిల్లాల్లో చిన్న గొడవలపై ఫిర్యాదులొచ్చినా, చాలా జిల్లాల్లో ఎలాంటి గొడవల్లేకుండాపోలింగ్ సాఫీగా సాగింది. 12 జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి పరిస్థితులపై సమీక్షించాను. కొన్ని జిల్లాల్లో స్వల్ప స్థాయిలో ఫిర్యాదులొచ్చినట్లు వివరించారు. శ్రీకాకుళం నుంచి గుంటూరు వరకు ఎలాంటి సమస్యలు లేవు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు 48.3% పోలింగ్ నమోదైంది' అని వివరించారు. 'అన్నమయ్య జిల్లాలో చాలా ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. గత మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా అక్కడేం జరిగిందో తెలుసు కదా?' అని ఎస్ఈసీ ప్రశ్నించారు. 'ఆదివారం నాటి పోలింగ్ సందర్భంగా మదనపల్లెలో మూడు ఫిర్యాదులపైనా కలెక్టర్‌తో మాట్లాడాను. ప్రకాశం జిల్లాలో మరో ఫిర్యాదుపై కలెక్టర్‌తో మాట్లాడితే అందులో సరైన ఆధారం లేదని తెలిపారు. పులివెందులలో 70 పోలింగ్ కేంద్రాల్లో వైకాపా ఏజెంట్లు లేరన్న సమాచారంపై ఎస్పీతో మాట్లాడాను. ఏజెంట్ల వివరాలిస్తే పోలీసు భద్రతతో పంపుతానని ఫిర్యాదుదారులకు చెప్పాను. విజయవాడలోని 55వ డివిజన్‌లో పోలింగ్‌ను సాయంత్రం 7.30 వరకు పొడిగించాం. బ్యాలట్ పేపర్లలో గుర్తులు తేడా రావడంతో ఉదయం గంటన్నరపాటు పోలింగ్ నిలిచిపోయింది. అధికారులు మళ్లీ బ్యాలట్ పత్రాలు ముద్రించి పోలింగ్ తిరిగి ప్రారంభించారు' అని పునేఠా తెలిపారు. 'నామినేషన్ల ప్రక్రియ మొదలుకుని ఇప్పటివరకు 275 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి 107 మందిని అరెస్టుచేశాం. ఆదివారం నాటి పోలింగ్ సందర్భంగా 40 ఘటనలు చోటు చేసుకున్నాయి. కేసులు నమోదు చేయదగ్గ పరిస్థితులు ఉంటే తప్పక చర్యలు తీసుకుంటాం' అని ఐజీ రాజకుమారి అన్నారు.



పట్టణ పోరులో ఓటరు జోరు!

- నేడే ఫలితాలు
- 83.6 శాతంతో గూడూరుకు అగ్రస్థానం..
- జీవీఎంసీలో అత్యల్పంగా 39.7 శాతం నమోదు
- పులివెందుల, జమ్మలమడుగు ఘటనలపై నివేదికలు కోరిన ఎస్ఈసీ

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఆదివారం ఉదయం మందకొడిగా ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ మధ్యాహ్నానికి ఊపందుకుని సాయంత్రానికి పలు ప్రాంతాల్లో జోరందుకుంది. 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 73 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీలు.. మొత్తం 92 పట్టణ స్థానిక సంస్థల్లో జరిగిన ఎన్నికల్లో ఓటర్లు తమ తీర్పును బ్యాలెట్ పెట్టెల్లో భద్రపరిచారు. సోమవారం నుంచి అభ్యర్థుల గెలుపోటములపై రాజకీయ వర్గాల్లో లెక్కలు మొదలు కానున్నాయి.ఆదివారం సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు. నిర్ణీత సమయానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా సాగినప్పటికీ పులివెందుల సహా కొన్ని చోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని వెల్లడించారు. పోలింగ్ ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించినట్లు చెప్పారు.

గూడూరులో అత్యధికం.. జీవీఎంసీలో అత్యల్పం

పోలింగ్ శాతంలో పట్టణాల మధ్య స్పష్టమైన వ్యత్యాసం కనిపించింది. కర్నూలు జిల్లా గూడూరు నగర పంచాయతీలో అత్యధికంగా 83.6 శాతం ఓటింగ్ నమోదైంది. మరోవైపు జీవీఎంసీ కార్పొరేషన్ పరిధిలో అత్యల్పంగా 39.7 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాల వారీగా, రాష్ట్రవ్యాప్తంగా నమోదైన తుది పోలింగ్ శాతాన్ని సోమవారం ప్రకటిస్తామని ఎస్ఈసీ స్పష్టం చేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లో 63 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి అంతకంటే ఎక్కువ శాతం ఓట్లు పోలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని ఎన్నికల సంఘం అంచనా వేస్తోంది. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ చివరి గంటల్లో ఊపందుకోవడం ఈ అంచనాలకు బలం చేకూరుస్తోంది.

కొన్ని చోట్ల ఉద్రిక్తతలు.. నివేదికలకు ఆదేశం

పోలింగ్ సందర్భంగా పులివెందుల, జమ్మలమడుగు ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘటనలు ఎన్నికల సంఘం దృష్టికి వెళ్లాయి. ఈ వ్యవహారాలపై కడప కలెక్టర్‌తో మాట్లాడినట్లు అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. జమ్మలమడుగు ఘటనపై నివేదిక కోరినట్లు వెల్లడించారు. కలెక్టర్లు, ఎస్పీల నుంచి అందే నివేదికలను పరిశీలించిన అనంతరం అవసరమైన చోట రీపోలింగ్ నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. సుమారు 70 ప్రాంతాల్లో తమకు పోలింగ్ ఏజెంట్లు లేరని వైసీపీ ఫిర్యాదు చేసిన అంశంపైనా స్పందించారు. అవసరమైతే ఏజెంట్లను ఎస్కార్ట్‌తో పోలింగ్ కేంద్రాలకు పంపిస్తామని చెప్పినట్లు తెలిపారు. కొన్ని జిల్లాల నుంచి ఫిర్యాదులు అందాయని, జిల్లా ఎన్నికల పరిశీలకులతో ఎప్పటికప్పుడు మాట్లాడి పరిస్థితిని సమీక్షించామని వివరించారు. ఆధారాలు లేకుండా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేమని స్పష్టం చేశారు.

విజయవాడలో అదనపు సమయం


విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 55వ డివిజన్‌లో బ్యాలెట్ పత్రాలపై రాజకీయ పార్టీల గుర్తులు తారుమారు కావడంతో పోలింగ్ ప్రారంభం ఆలస్యమైంది. దీంతో ఎన్నికల సంఘం ఇక్కడ పోలింగ్ సమయాన్ని పొడిగించింది. రాత్రి 7.30 గంటల వరకు ఓటు వేసేందుకు అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు.

నేడే అభ్యర్థుల భవితవ్యం

పట్టణ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేడు నిర్వహించనున్నారు. అదే రోజు ఫలితాలను ప్రకటించనున్నారు. దీంతో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం మరికొద్ది గంటల్లో తేలనుంది. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం ఇచ్చామని పేర్కొన్న ఎస్ఈసీ.. ఇదే తరహాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలను కూడా నిర్వహిస్తామని తెలిపారు. మొత్తానికి పట్టణ ఎన్నికల పోలింగ్ ముగియడంతో రాజకీయ పార్టీల దృష్టి ఇప్పుడు ఓట్ల లెక్కింపుపై పడింది. ఎక్కడ ఎవరికి ఆధిక్యం లభించింది? ఎవరికి ఓటరు పట్టం కట్టాడు? అన్నది తేలాలంటే నేటి సాయంత్రం వరకు వేచి చూడాల్సిందే.

రిజర్వేషన్ల దెబ్బకు నేతల వ్యూహాలు బోల్తా!

- 66 డివిజన్లు.. ఆశావహుల్లో గుబులు!
- మేయర్ పీఠం బీసీ మహిళకు.. పార్టీల్లో టికెట్ల తంటా!
- రిజర్వేషన్ల రీసెట్.. నేతల రాజకీయ లెక్కలు తలకిందులు!
- టికెట్ ఎవరికో.. సీటు ఎవరికి? పార్టీల్లో కొత్త పంచాయితీ!
- బీసీలకు 26.. మేయర్ పీఠంపై కొత్త రాజకీయ సమీకరణాలు!
- డివిజన్లలో రిజర్వేషన్ల సెగ.. నేతల్లో పదవుల పేగు!



కాకినాడ: కాకినాడ నగర రాజకీయాల్లో రిజర్వేషన్ల చిచ్చు రేగింది! ఇన్నాళ్లూ టికెట్ తమదేనని ధీమాగా ఉన్న నేతల ఆశలపై రిజర్వేషన్లు నీళ్లు చల్లాయి. 66 డివిజన్ల కేటాయింపులతో కొందరి రాజకీయ భవిష్యత్తుకు బ్రేకులు పడితే.. మరికొందరికి అదృష్టం తలుపు తట్టింది. బీసీలకు 26 స్థానాలు.. మేయర్ పీఠం బీసీ మహిళకు కేటాయించడంతో పార్టీల్లో పదవుల లెక్కలు మొదలయ్యాయి. ఎవరికి టికెట్ ఇవ్వాలి? ఎవరికి మొండిచేయి చూపాలి? అన్నది అధిష్ఠానాలకు అసలు పరీక్షగా మారింది. ఆశావహుల ఒత్తిళ్లు ఒకవైపు.. గెలుపు సమీకరణాలు మరోవైపు.. కాకినాడ రాజకీయ చదరంగంలో అసలు ఆట ఇప్పుడే మొదలైంది!

కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికలకు ముందే రాజకీయ వేడి రాజుకుంది. 66 డివిజన్లకు రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఇన్నాళ్లూ టికెట్ల కోసం ఆశలు పెట్టుకున్న నాయకుల రాజకీయ లెక్కలు తలకిందులయ్యాయి. తమకు అనుకూలమైన డివిజన్లలో పోటీకి సిద్ధమైన నేతలకు రిజర్వేషన్లు కొత్త సవాళ్లు విసరగా.. మరికొందరు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించారు. ముఖ్యంగా బీసీలకు 26 స్థానాలు కేటాయించడంతో పాటు మేయర్ పదవిని బీసీ మహిళకు రిజర్వు చేయడం నగర రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. దీంతో తెలుగుదేశం, జనసేన, వైకాపా పార్టీల్లో అభ్యర్థుల ఎంపికపై అప్పుడే అంతర్గత చర్చలు మొదలయ్యాయి.

మొత్తం 66 డివిజన్లలో బీసీలకు 26, జనరల్ మహిళలకు 17, అన్‌రిజర్వుడ్ కేటగిరీకి 16, ఎస్సీలకు ఆరు, ఎస్టీలకు ఒక స్థానం కేటాయించారు. ఈ రిజర్వేషన్లతో గత కొంతకాలంగా ఎన్నికల కోసం కసరత్తు చేస్తున్న పలువురు ఆశావహులకు కొత్త పరిస్థితులు ఎదురయ్యాయి. తాము ఆశించిన డివిజన్ రిజర్వేషన్ మారిపోవడంతో కొందరు నిరాశకు గురవుతుండగా.. మరికొందరు తమ కుటుంబ సభ్యులను బరిలోకి దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఒకే డివిజన్‌పై పలువురు నేతలు కన్నేయడంతో టికెట్ ఎవరికి దక్కుతుందన్నది పార్టీల్లో ఆసక్తికరంగా మారింది.

మేయర్ పదవి బీసీ మహిళకు కేటాయించడంతో ఈసారి నగర రాజకీయాల్లో కొత్త సమీకరణాలు తెరపైకి రానున్నాయి. మేయర్ పీఠాన్ని లక్ష్యంగా చేసుకున్న ప్రధాన పార్టీలు అందుకు అనుగుణంగా డివిజన్ల వారీగా అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. మేయర్ పదవికి అర్హత కలిగిన మహిళా నాయకురాలిని గుర్తించడంతోపాటు ఆమెకు రాజకీయంగా మద్దతు కూడగట్టడం పార్టీలకు కీలకంగా మారనుంది. మరోవైపు ఇన్నాళ్లూ డివిజన్ టికెట్ కోసం ప్రయత్నించిన నాయకులు ఇప్పుడు తమకు అనుకూలమైన సామాజిక సమీకరణాలు ఉన్న ప్రాంతాలపై దృష్టి సారిస్తున్నారు. పార్టీ కోసం పనిచేసిన వారికి అవకాశం కల్పిస్తారా? లేక గెలుపు అవకాశాలను పరిగణనలోకి తీసుకుని కొత్తవారికి ప్రాధాన్యం ఇస్తారా? అన్నది చర్చనీయాంశంగా మారింది.

రిజర్వేషన్లతో ఎన్నికల రాజకీయాలు వేడెక్కుతున్న తరుణంలో నగరపాలక సంస్థ పరిధి, డివిజన్ల సరిహద్దుల వివాదం కూడా తెరపైకి వచ్చింది. ముఖ్యంగా 42, 48 డివిజన్ల పరిధి, గతంలో విలీనం చేయాల్సిన ఆరు గ్రామాల అంశంపై పౌర సంక్షేమ సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. డివిజన్ల పునర్విభజన, విలీన గ్రామాల అంశాలపై న్యాయపరమైన వివాదాలు కొనసాగుతున్నాయని సంఘం ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో నవంబరు 2న హైకోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించనున్నట్లు వారు వెల్లడించారు. దీంతో ఎన్నికల ప్రక్రియపై న్యాయస్థానం నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపుతుందన్న ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉంటే నగరంలోని అనేక డివిజన్లలో తాగునీరు, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, డ్రెయినేజీ, వీధి దీపాలు, ట్రాఫిక్ సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయి. ఎన్నికల సమయంలో నాయకులు ఇచ్చే హామీలకు, ఆ తర్వాత జరిగే పనులకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు బేరీజు వేసుకునే పరిస్థితి ఉంది. కేవలం రిజర్వేషన్లు, రాజకీయ సమీకరణాలతోనే ఎన్నికల బరిలో నిలవడం కాకుండా స్థానిక సమస్యలపై అభ్యర్థులు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. మొత్తం మీద 66 డివిజన్ల రిజర్వేషన్ల ప్రకటనతో కాకినాడలో ఎన్నికల చదరంగం మొదలైంది. టికెట్ల కోసం నేతల మధ్య పోటీ, మేయర్ పీఠంపై పార్టీల వ్యూహాలు, డివిజన్ల సరిహద్దుల వివాదం.. ఇలా ఒక్కో పరిణామం నగర రాజకీయాలను ఆసక్తికరంగా మారుస్తోంది.

పల్లెపల్లెనా కూటమి ప్రచార జోరు!

» ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగుతున్న జెడ్పీటీసీ అభ్యర్థి తమ్మినేని సుజాత



ఆమదాలవలస: ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థులు దూకుడు పెంచారు. ఆమదాలవలస మండలంలో కూటమి జెడ్పీటీసీ అభ్యర్థి తమ్మినేని సుజాత పల్లెపల్లెనా పర్యటిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. సోమవారం స్థానిక ఎంపీటీసీ కూటమి అభ్యర్థులు బొడ్డేపల్లి సుజాత, బొడ్డేపల్లి గౌరీపతిరావులతో కలిసి ఆమె విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయం నుంచే శ్రీనివాసాచార్యులపేట, అక్కులపేట, తురకపేట పంచాయతీల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను పలకరించారు. స్థానికులతో ఆప్యాయంగా మమేకమవుతూ వారి ఆదరాభిమానాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన, చేపట్టబోయే సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి ప్రణాళికలను ప్రజలకు వివరించారు. తమ అభ్యర్థులకు మద్దతుగా నిలిచి విజయాన్ని అందించాలని ఓటర్లను అభ్యర్థించారు. సాయంత్రం కొర్లకోట పంచాయతీలో నిర్వహించిన ప్రచారానికి విశేష స్పందన లభించింది. గ్రామాల్లో అడుగడుగునా అభ్యర్థులకు ప్రజలు, కూటమి శ్రేణులు ఘనస్వాగతం పలికారు. మహిళలు, స్థానిక పెద్దలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రచారంలో పాల్గొని అభ్యర్థులకు సంఘీభావం తెలిపారు. గ్రామాల్లో కొనసాగిన ఈ ప్రచారంతో కూటమి శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.



వర్షంలోనూ చెక్కుచెదరని అభిమానం.. ఎర్రన్నాయుడు స్మృతికి జోహార్లు!

» నిమ్మాడలో భావోద్వేగాల నడుమ 14వ వర్ధంతి
» ఆధునికీకరించిన స్మృతివనం వేదికగా కుటుంబ సభ్యులు, అభిమానుల ఘన నివాళులు
» అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు సహా ప్రముఖుల పుష్పాంజలి





కోటబొమ్మాళి: ప్రజా జీవితంలో చెరగని ముద్ర వేసిన దివంగత దిగ్గజ నేత, మాజీ కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు 14వ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగ్రామం నిమ్మాడ మరోసారి అభిమాన జనసంద్రమైంది. రాజకీయ ప్రస్థానంలో ఆయన అందించిన సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, రాజకీయ ప్రముఖులు, అభిమానులు అశ్రునివాళులర్పించారు. ఆధునికీకరించిన ఎర్రన్నాయుడు స్మృతివనం వేదికగా సోమవారం నిర్వహించిన వర్ధంతి కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో సాగింది.

అగ్రనేతల నివాళులు.. కుటుంబ సభ్యుల సమక్షంలో..

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి స్మృతివనం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఎర్రన్నాయుడు సతీమణి విజయమ్మతో పాటు కింజరాపు హరివరప్రసాద్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కింజరాపు ప్రభాకర్ తదితర కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎర్రన్నాయుడితో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన ప్రజాసేవ, రాజకీయ ప్రస్థానం, ప్రజలతో మమేకమైన తీరును స్మరించుకున్నారు.



వర్షాన్ని లెక్కచేయని అభిమానం!

ఒకవైపు వర్షం కురుస్తున్నా మరోవైపు అభిమానుల రాక మాత్రం ఆగలేదు. వాతావరణ పరిస్థితులను సైతం లెక్కచేయకుండా నిమ్మాడకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు, పార్టీ శ్రేణులు తమ అభిమాన నేతకు నివాళులర్పించారు. 14 ఏళ్లు గడిచినా ఎర్రన్నాయుడిపై ప్రజల్లో ఉన్న అభిమానానికి ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచింది. స్మృతివనం వద్ద పుష్పాంజలి ఘటించిన అనంతరం కుటుంబ సభ్యులను పలువురు ఆత్మీయంగా పలకరించి తమ అనుబంధాన్ని పంచుకున్నారు.

ప్రజాసేవే చిరస్మరణీయం..

రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన ఎర్రన్నాయుడు ప్రజలకు చేసిన సేవలు, ఆయన అనుసరించిన ప్రజా సంబంధాల విధానం నేటికీ స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవకు అంకితమవుతామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యుడు మామిడి గోవిందరావు, పార్టీ సీనియర్ నాయకులు బోయిన గోవిందరాజులు, అరవల రవీంద్ర, వెలమల కామేశ్వరరావు, శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.







విశాఖ ఓటింగ్ లెక్కల్లో మతలబేంటి?



అమరావతి: విశాఖలో ఓటింగ్ శాతంపై రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన గణాంకాలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. పోలింగ్ ముగిసిన తర్వాత ప్రకటించిన ఓటింగ్ శాతానికి, ఆ తర్వాత వెల్లడించిన గణాంకాలకు మధ్య భారీ వ్యత్యాసం కనిపించడంపై భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తొలుత 50.2 శాతం పోలింగ్ నమోదైనట్లు ప్రకటించి, అనంతరం 51.47 శాతంగా పేర్కొని, మరుసటి రోజు ఉదయానికి 56.32 శాతానికి పెరిగినట్లు వెల్లడించడంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ప్రశ్నల వర్షం కురిపించారు. పోలింగ్ ముగిసిన తర్వాత దాదాపు ఆరు శాతం ఓట్లు అదనంగా ఎలా నమోదయ్యాయని ఆయన ప్రశ్నించారు.లిలి ఈ ఓట్లు ఎప్పుడు పోలయ్యాయి? ఏయే పోలింగ్ కేంద్రాల్లో నమోదయ్యాయి? పోలింగ్ ముగిసిన సమయానికి ఉన్న లెక్కలకు, తదుపరి ప్రకటించిన గణాంకాలకు మధ్య వ్యత్యాసానికి కారణాలేమిటి? అంటూ ఎన్నికల సంఘాన్ని నిలదీశారు. ఒకే ఎన్నికకు సంబంధించి వేర్వేరు సమయాల్లో వేర్వేరు ఓటింగ్ శాతాలు ప్రకటించడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోందని పేర్కొ న్నారు. జిల్లా కలెక్టర్ ప్రకటించిన 51.47 శాతం గణాం కాలకు, ఆ తర్వాత వెల్లడైన 56.32 శాతానికి మధ్య ఉన్న తేడాను ఎన్నికల సంఘం వివరించాలని డిమాండ్ చేశారు.

» పోలింగ్ ముగిశాక ఆరు శాతం ఓట్లు ఎలా పెరిగాయి?
» 50.2 నుంచి 56.32 శాతానికి.. ఓటింగ్ లెక్కల్లో అంతుచిక్కని మార్పు!
» ఓటింగ్ గణాంకాలపై సీపీఐ సమర శంఖం
» కేంద్రాలవారీగా ఓట్ల లెక్కలు వెల్లడించాలి.. ఈశ్వరయ్య డిమాండ్
» ప్రకటించిన గణాంకాల్లో పరస్పర వైరుధ్యాలపై సీపీఐ నిలదీత.. సమగ్ర విచారణకు డిమాండ్

కేంద్రాలవారీగా లెక్కలు బయటపెట్టాలి!

కేవలం శాతం ప్రకటించి చేతులు దులుపుకోవడం కాకుండా, ప్రతి పోలింగ్ కేంద్రంలో నమోదైన ఓట్ల సంఖ్య, మొత్తం ఓటర్ల సంఖ్య, పోలింగ్ ముగింపు సమయం, మొదట పంపిన గణాంకాలు, అనంతరం చేసిన సవరణల వివరాలను బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో సంబంధిత రికార్డులను ధ్రువీకరించాలని కోరారు.


ఓటింగ్ గణాంకాలపై రాజకీయ పార్టీలు, ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయకుండా కౌంటింగ్ ప్రక్రియ ముందుకు సాగడం సరికాదని ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కలిగించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదేనని స్పష్టం చేశారు. అనుమానాలకు తావులేకుండా సమగ్ర విచారణ జరిపి, విశాఖ ఓటింగ్ శాతంలో వచ్చిన మార్పులకు సంబంధించిన వాస్తవాలను ప్రజల ముందుంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు.

ఆలస్యంగా వచ్చిన సమాచారం పేరుతో లెక్కలు మారాయా?

పోలింగ్ ముగిసిన తర్వాత కొన్ని గంటల వ్యవధిలోనే ఓటింగ్ శాతం గణనీయంగా పెరగడానికి కారణం ఏమిటో స్పష్టం చేయాలని ఈశ్వరయ్య కోరారు. పోలింగ్ కేంద్రాల నుంచి ఆలస్యంగా సమాచారం అందిందా? గణాంకాల సవరణ జరిగిందా? సాంకేతిక కారణాలున్నాయా? లేక మరేదైనా కారణమా? అన్నది అధికారికంగా వెల్లడించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు.

మురసు'ను ఎదుర్కొనేందుకు విద్యుత్ శాఖ సర్వసన్నద్ధం

» గరిష్ఠంగా 120 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం.. ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి
» ఆసుపత్రులు, అత్యవసర సేవలకు విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్ బ్యాకప్
» ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే సిబ్బందికి వసతి, భోజన సదుపాయాలు కల్పించాలి
» సిబ్బంది భద్రతకు తొలి ప్రాధాన్యం.. తుపాను తగ్గిన వెంటనే పునరుద్ధరణ పనులు



అమరావతి, నవంబర్ 02, ఎక్స్‌ప్రెస్‌టుడే: మురసు' తుపానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు విద్యుత్ శాఖ పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు పటిష్ఠమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఏపీసీపీడీసీఎల్ పరిధిలో తుపాను ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని పేర్కొంటూ, ఆ సంస్థ పరిధిలోని సీఎండీ నుంచి క్షేత్రస్థాయి లైన్‌మెన్ వరకు 5 వేల మందికి పైగా ఉద్యోగులతో మంత్రి గొట్టిపాటి సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను సన్నద్ధత, విద్యుత్ వ్యవస్థ రక్షణ, ప్రజలకు అవగాహన, పునరుద్ధరణ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. గతంలో అర్ణబ్ తుపాను సమయంలో ఎదురైన సమస్యలను సమీక్షించి, అవి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లకు జరిగే నష్టాన్ని ముందుగానే అంచనా వేయాలని చెప్పారు. అవసరమైన స్తంభాలు, కండక్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, మరమ్మతు పరికరాలు, వాహనాలు, యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. తుపాను తీరం దాటే సమయంలో గరిష్ఠంగా గంటకు 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి విద్యుత్ డివిజన్ పరిధిలో ప్రత్యేక కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి, పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. తుపాను ప్రభావం తగ్గిన వెంటనే సురక్షిత పరిస్థితులను అంచనా వేసి, క్షేత్రస్థాయిలో పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు.

ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి

తుపాను సమయంలో విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. మీడియా, సిటీ కేబుల్, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడంతో పాటు ప్రతి విద్యుత్ ఉద్యోగి తన వాట్సాప్ స్టేటస్‌లోనూ భద్రతా సూచనలు ఉంచాలని కోరారు. స్థానిక సోషల్ మీడియా గ్రూపుల్లోనూ సమాచారాన్ని విస్తృతంగా పంచుకోవాలన్నారు. తెగిపడిన విద్యుత్ తీగలను తాకరాదని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించేలా ప్రచారం చేయాలన్నారు. విపత్కర పరిస్థితుల్లో విధులు నిర్వహించే విద్యుత్ సిబ్బంది భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు సేవలు అందించడం ఎంత ముఖ్యమో, అదే సమయంలో ఉద్యోగులు తమ ప్రాణాలను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ప్రతికూల వాతావరణంలో తగిన భద్రతా ప్రమాణాలు పాటించకుండా విధులు నిర్వహించరాదన్నారు. రక్షణ పరికరాలు అందుబాటులో ఉంచుకుని, సురక్షిత పరిస్థితులు నిర్ధారించిన తర్వాతే మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు.

ఆసుపత్రులకు జనరేటర్ బ్యాకప్

తుపాను సమయంలో ఆసుపత్రులు, ఇతర అత్యవసర సేవలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన చోట జనరేటర్ బ్యాకప్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రజారోగ్యం, రెవెన్యూ, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేస్తే తుపాను ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు.

ఇతర రాష్ట్రాల సిబ్బందికి ప్రత్యేక ఏర్పాట్లు

పునరుద్ధరణ పనుల కోసం తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి వచ్చే విద్యుత్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి, నాణ్యమైన భోజనం, తాగునీరు, రవాణా సదుపాయాలు కల్పించాలని మంత్రి సూచించారు. ఇందుకోసం ముందుగానే స్థానికంగా అందుబాటులో ఉన్న కల్యాణ మండపాలను గుర్తించి సిద్ధం చేసుకోవాలని అధికారులకు తెలిపారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా ప్రజల భద్రత, విద్యుత్ ఉద్యోగుల సంక్షేమం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.

పిలిస్తే పలికే దైవం కృష్ణా... గురువాయురప్పా...



కృష్ణా... గురువాయురప్పా..! ఈ ఒక్క మాట మనకి బాగా పరిచయం ఉన్న కేరళంలో ఎక్కువ వినిపిస్తుంటుంది. కేరళం పేరు వింటే మనకి గుర్తుకు వచ్చే దేవాలయం గురువాయూర్. శ్రీ కృష్ణ దేవాలయాలలో కేరళలో ఉన్న గురువాయురప్పన్ దేవాలయం ఎంతో విశిష్టమైనది.

ఆయనను బాలగోపాలుడిగా భక్తితో కొలుస్తారు. ఆర్ద్రతతో కృష్ణా... గురువాయురప్పా అనిపిలిస్తే పలుకుతాడని కేరళ వాసుల నమ్మకం. ఎంతో మంది కృష్ణ భక్తులు భక్తితో పలవరిస్తుంటారు. బాలగోపాలుడు ఇక్కడ అల్లరి చేస్తూ తిరుగుతాడు అని చూసిన వాళ్ళు చెప్తుంటారు. కురూరమ్మ బిల్వమంగళుడు వీరి ఇంట్లో అల్లరి కన్నయ్య తిరుగాడేవాడని ఇక్కడివారి నమ్మకం.

అందుకే ఇక్కడికి వచ్చే ప్రతి భక్తుడు తామే కురూరమ్మ బిల్వమంగళుడిగా భావిస్తుంటారు. మన తెలుగు వారు అయ్యప్ప మాల వేసుకుని దర్శనం తరువాత లేదా ముందు ఇక్కడ అల్లరి కన్నాయని గురువాయూర్ లో దర్శనం తప్పని సరిగా దర్శనం చేసుకుంటారు. తాము రాధాకృష్ణులమని భావించి తులసి మాలలు వేసుకుని గురువాయూర్‌లో వివాహం చేసుకోవడం గొప్ప అనుభూతి. అలాగే అల్లరి కన్నయ్యకి నృత్యం, ఆటపాటలు అంటే ఇష్టం.

అందుకే ప్రతిరోజు అరంగేట్రం సంగీత కచేరీలు జరుగుతుంటాయి. కన్నయ్యకి పాలు, బియ్యం పంచదార వేసి పాయసం చేసి నైవేద్యం పెడతారు. పసిపిల్లలను తులాభారం చేయిస్తారు. అలాగే మొక్కు తీర్చడానికి ఏనుగులు సమర్పించేవారు. ఆ విధంగా సుమారు 38 ఏనుగులతో పునాథూర్ కోటలో చూడవచ్చు. విదేశాల నుండి కూడా భక్తులు ఇక్కడికి వస్తారు. ఈ ఏనుగులతో పరుగు పందాలు, ఏనుగులకు విందు కార్యక్రమాలు ఉంటాయి మరి కృష్ణాష్టమి రోజు విశేషమైన పూజలు జరుపుతారు.

కేరళ వాళ్ళ కొత్త సంవత్సరాది రోజు ఉదయం ఈ కన్నయ్యని ముందుగా చూస్తారు. దానిని విషు కని అంటారు. గురువు, వాయువు కలిసి నదిలో దొరికిన విగ్రహం ఇక్కడ బాల గోపాలుడి దర్శనం. ఈ ఆలయం త్రిచూర్ రైల్వే స్టేషన్‌కి 20 కిలోమీటర్లు లేదా కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గరలో ఉంది.



పట్టభద్రుల్లో ప్రతి పదిలో 8 మందికి నో జాబ్స్

దేశంలో నిరుద్యోగం అంతకంతకూ తీవ్రమవుతున్నది. ఉన్నత చదువులు చదివిన వారికి కూడా అర్హతకు తగ్గ ఉద్యోగాలు లభించడం లేదు. ఎంబీఏ విద్యార్థుల్లో కేవలం 26 శాతం మంది, ఇంజినీర్లలో కేవలం 15 శాతం మంది, పట్టభద్రుల్లో కేవలం 16 శాతం మంది మాత్రమే ఉపాధి అవకాశాలు పొందుతున్నారని 'అన్‌స్టాప్ టాలెంట్ రిపోర్ట్ 2026' వెల్లడించింది. ఈ లెక్కన 70 నుంచి 85 శాతం మంది విద్యార్థులు నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నారని పేర్కొన్నది. పట్టభద్రులు కానివారిలో 84శాతం మంది నిరుద్యోగులుగా ఉండగా, 17 శాతం మందికి నియమాలు ఆలస్యం కావడం లేదా చివరి నిమిషంలో రద్దు కావడం జరుగుతున్నదని తెలిపింది. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో 150కిపైగా కంపెనీలు కాలేజీలకు వచ్చినప్పుడు 2.9 రెట్లు అధికంగా ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, 30 కన్నా తక్కువ కంపెనీలు వచ్చినప్పుడు మాత్రం చాలా తక్కువ మందికి ఉద్యోగాలు వస్తాయని ఆ నివేదిక వివరించింది. గత ఏడాదిలోపు పట్టభద్రులైన వారిలో మెజారిటీ విద్యార్థులు ఇంతవరకు ఉపాధిని పొందలేకపోయారని తెలిపింది. కంపెనీలు కొత్తవారిని చేర్చుకుంటున్నప్పటికీ ఆచితూచి ఎంపిక చేస్తున్నాయని తెలిపింది. అవకాశాలు కొన్ని క్యాంపస్‌లలో, నైపుణ్య సమూహాలలో, నియామక పద్ధతుల్లో కేంద్రీకృతమై ఉన్నాయని వివరించింది.

కార్మికులు, యువతలో నైపుణ్యాలు పెంపొందించే లక్ష్యంతో కేంద్ర సర్కార్ 2015లో పీఎం కౌశల్ వికాస్ యోజన స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. అదే ఏడాది స్కిల్ ఇండియా మిషన్‌ను కూడా ప్రవేశపెట్టింది. అయితే ఈ పథకాలన్నీ ప్రచారా ఆర్భాటాలకే పరిమితమయ్యాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. హార్వర్డ్ బిజినెస్ స్కూల్, పీఎల్ఎస్ఎఫ్, ఐఎల్‌వో, అన్‌స్టాప్ సంస్థలు విడుదల చేసిన నివేదికలను పరిశీలిస్తే ఇది నిజమేనని అంటున్నారు. మోదీ సర్కారు ఇప్పటికైనా ఉపాధి కల్పనపై దృష్టిపెట్టాలని సూచిస్తున్నారు.

దేశంలో చదువుకు తగ్గ ఉద్యోగాలు చేస్తున్న పట్టభద్రులు కేవలం 8.25 శాతం మంది మాత్రమేనని హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాంపిటీటివ్‌నెస్ సంస్థ ఇటీవలి అధ్యయనంలో వెల్లడించింది. 50 శాతానికిపైగా పట్టభద్రులు క్లర్క్, మెషీన్ ఆపరేటర్ వంటి ఏడో తరగతి స్థాయి ఉద్యోగాలను చేస్తున్నట్టు పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేలో తేలింది. దేశంలో 47 శాతం మందిలో కంపెనీలకు అవసరమైన నైపుణ్యాలు కొరవడినట్టు అంతర్జాతీయ కార్మిక సంస్థ పేర్కొన్నది.

కేంద్ర ప్రభుత్వ ఉక్కు ఉత్పత్తి సంస్థ స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) ఒప్పంద కార్మికులను గణనీయంగా తగ్గించాలని నిర్ణయించింది. ఇప్పటికే దీనిని అమలు చేయడం ప్రారంభించింది. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి 40 శాతం ఒప్పంద కార్మికులను సంస్థ తొలగించనుంది. ఈ వార్త కార్మిక వర్గాల్లో సంచలనం సృష్టించింది. సంస్థ ఇలాంటి నిర్ణయం తీసుకుంటే తమ జీవితాలు ఏం కావాలని వారు ఆందోళన చెందుతున్నారు. బొకారో స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ ఇన్‌చార్జి ప్రియా రంజన్ పేరిట ఏప్రిల్ 18న సంస్థ పంపిన ఒక అంతర్గత లేఖలో సమీకృత ఉక్కు కర్మాగారాలలోని పనులు, పనేతర విభాగాలలోని ఒప్పంద కార్మికుల హేతుబద్ధీకరణకు సంబంధించిన లక్ష్యాల గురించి 2025లో జారీ చేసిన లేఖల ద్వారా తెలియజేసినట్టు పేర్కొన్నది. అలాగే ఈ ఏడాది ఫిబ్రవరి 12న రాసిన లేఖలో సెయిల్ ఇప్పటికే నిర్దేశించిన 20 శాతం లక్ష్యంలో 18.8 శాతం కాంట్రాక్టు కార్మికులను తగ్గించినట్టు తెలిపింది. 2026-26 ఆర్థిక సంవత్సరంలో కూడా ఒప్పంద కార్మికుల హేతుబద్ధీకరణను కొనసాగించాల్సిన అవసరాన్ని తాజా లేఖ స్పష్టం చేసింది. దీని ప్రకారం 2027 మార్చి 31 నాటికి 40 శాతం ఒప్పంద కార్మికులను తగ్గించాలని సంస్థ లక్ష్యంగా నిర్ణయించుకుంది.

ఎక్కువగా ప్రాచుర్యం పొందుతున్న లింఫాటిక్ మసాజ్..

శరీరంలో బ్లోటింగ్, వాపు, అలసట వంటి సమస్యలు తరచూ ఎదురవుతున్నాయా? అయితే తాజాగా ప్రాచుర్యంలోకి వచ్చిన లింఫాటిక్ మసాజ్ అనే పద్ధతి ఈ సమస్యలకు ఉపశమనం కలిగిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే ఇది పూర్తిగా నిరూపితమైన చికిత్స కాదని, ముఖ్యంగా డిటాక్స్ లేదా సాధారణ బ్లోటింగ్ విషయంలో ఇంకా పరిశోధనలు కొనసాగుతున్నాయని స్పష్టం చేస్తున్నారు. లింఫాటిక్ మసాజ్ కు మరో పేరు మాన్యువల్ లింఫాటిక్ డ్రైనేజ్. శరీరంలోని లింఫాటిక్ వ్యవస్థను ఉత్తేజపరిచే సున్నితమైన మసాజ్ పద్ధతి. ఈ వ్యవస్థ శరీరంలో వ్యర్థాలు, టాక్సిన్లు, అదనపు ద్రవాన్ని తొలగించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. సాధారణ డీప్ టిష్యూ మసాజ్‌లకు భిన్నంగా, ఇందులో తేలికైన, రిథమిక్ స్ట్రోక్స్‌తో లింఫ్ ద్రవ ప్రవాహాన్ని మెరుగుపరుస్తారు.

ద్రవ ప్రవాహాన్ని మెరుగు పరిచే మసాజ్..

బ్లోటింగ్ సమస్య కేవలం ఆహారం వల్ల మాత్రమే కాకుండా, నీటి నిల్వ (వాటర్ రిటెన్షన్), రక్తప్రసరణ లోపం, హార్మోన్ మార్పులు, జీర్ణక్రియ సమస్యలు, ఎక్కువసేపు కూర్చోవడం వంటి కారణాల వల్ల కూడా వస్తుంది. లింఫాటిక్ వ్యవస్థ సరిగా పనిచేయకపోతే శరీరంలో ద్రవం నిల్వ అయి భారంగా అనిపించే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ మసాజ్ ద్వారా ద్రవ ప్రవాహం మెరుగుపడి వాపు, పఫినెస్ తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే శరీరంలోని వ్యర్థాలను తొలగించే ప్రక్రియకు మద్దతు లభిస్తుంది. రక్తప్రసరణ మెరుగుపడటంతో శరీరం తేలికగా, ఉత్సాహంగా అనిపిస్తుంది. కొందరు వ్యక్తులు దీన్ని తరచూ చేయడం వల్ల జీర్ణక్రియ కూడా కొంతవరకు మెరుగుపడిందని చెబుతున్నారు.

తేలికగా, మృదువుగా..

ఒక సాధారణ లింఫాటిక్ మసాజ్ సెషన్‌లో తేలికైన, స్లో స్ట్రోక్స్ ఉపయోగిస్తారు. ముఖ్యంగా మెడ, పొత్తికడుపు, చేతులు, కాళ్లపై దృష్టి పెడతారు. ఇది రిలాక్సింగ్‌గా ఉండే ప్రక్రియ, తీవ్రంగా ఒత్తిడి ఉండదు. చాలా మందికి వెంటనే తేలికగా అనిపించడం సాధారణం.

ఇంట్లో కూడా కొంతవరకు ఈ మసాజ్ చేయవచ్చు. అయితే నిపుణుల మార్గదర్శకత్వంలో మాత్రమే చేయడం మంచిది. తేలికైన ఒత్తిడితో, మెడ దగ్గర నుంచి ప్రారంభించి, లింఫ్ నోడ్స్ దిశగా నెమ్మదిగా మసాజ్ చేయాలి. అక్కడ తీవ్రంగా ఒత్తిడి చేయడం వల్ల ప్రయోజనం ఉండదు. క్రమం తప్పకుండా చేయడం ముఖ్యమే గానీ బలంగా చేయడం అవసరం లేదు.

అందరికీ సెట్ కాదు.. అయితే ఇది ప్రతి ఒక్కరికీ సరిపోదు. ఇన్ఫెక్షన్లు, గుండె సమస్యలు, కిడ్నీ వ్యాధులు లేదా ద్రవ సమతౌల్య సమస్యలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. సందేహం ఉంటే వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. లింఫాటిక్ మసాజ్ ఒక సహాయక పద్ధతి మాత్రమే. ఇది మాయమంత్రంలా అన్ని సమస్యలను పరిష్కరించదు. తగినంత నీరు తాగడం, నిత్యం వ్యాయామం చేయడం, లోతైన శ్వాస సాధన, ఉప్పు వినియోగాన్ని నియంత్రించడం, సరైన నిద్ర వంటి మంచి అలవాట్లతో కలిపి చేస్తే దీని ప్రయోజనాలు మెరుగుపడతాయి. శరీరాన్ని చురుకుగా ఉంచడం ద్వారా లింఫాటిక్ వ్యవస్థను సహజంగా సక్రమంగా పనిచేయేలా చేయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.



డిసెంబర్‌లో రానున్న 'ఇడుపు కాయితం'

అచ్చ తెలంగాణ మాండలికమైన ఇడుపు కాయితం అనే మాటను టైటిల్‌గా పెట్టి రూపొందిస్తున్న 'ఇడుపు కాయితం' చిత్రం ముహూర్తం రోజు నుంచే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. ఇందులో జానపద గీతాలతో సుపరిచితురాలైన నాగదుర్గ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ప్రియదర్శి హీరోగా తెలంగాణ నేపథ్య కథాంశంతో తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి వంశీ రెడ్డి దొండపాటి దర్శకుడు. ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ వెలువడింది. త్వరలో రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించి, డిసెంబర్ తొలివారంలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని మేకర్స్ తెలిపారు. శివజ్యోతి (తీన్మార్ సావిత్రి), జోర్దార్ సుజాత, చంద్రవ్వ, మౌనిక రెడ్డి, రచ్చ రవి, బిత్తిరి సత్తి, అజయ్ బేతిగంటి, మైమ్ మధు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, నిర్మాణం: సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్, నిర్మాత: బన్నీ వాస్, దర్శకత్వం: వంశీ దొండపాటి.

నాగచైతన్య కొత్త సినిమా?


ప్రస్తుతం అగ్ర కథానాయకుడు అక్కినేని నాగచైతన్య 'వృషకర్మ' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్నది. ఈ సినిమా తర్వాత చేయాల్సిన ప్రాజెక్ట్‌ని కూడా నాగచైతన్య ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. 'బెదురులంక 2012' చిత్రం ద్వారా గుర్తింపు తెచ్చుకున్న క్లాక్స్ దర్శకత్వంలో ఆయన తర్వాత సినిమా ఉంటుంది.

ఈ సినిమాను ఈ ఏడాది చివర్లో సెట్స్ పైకి తీసుకెళ్లే యోచనలో చైతూ ఉన్నారు. ఇదిలావుంటే.. ఈ క్రమంలోనే 'మసూద' దర్శకుడు సాయికిరణ్ కూడా ఇటీవలే చైతూకి కథ వినిపించారట. తన తొలి సినిమా 'మసూద'తో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న సాయికిరణ్, గత రెండేళ్లుగా ఓ హారర్ థ్రిల్లర్ స్క్రిప్ట్‌పై వర్క్ చేశారు. ఏషియన్ సునీల్ నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్ కోసమే చైతూని సాయికిరణ్ కలిసినట్టు, కథ వినిపించినట్టు తెలిసింది. అన్నీ కుదిరితే వచ్చే ఏడాది ఈ సినిమా సెట్స్‌పైకెళ్లే అవకాశం ఉన్నది.





ఆత్మతో కనకరాజు అవస్థలు



మెగా హీరో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు'. యూవీ క్రియేషన్స్, ఫన్‌ట్రేమ్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉన్నది. ఆగస్ట్ 7న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ఇప్పటికే ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చిందని మేకర్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు.

అగ్ర కథానాయకుడు ప్రభాస్ ఈ టీజర్‌ని ఆవిష్కరించి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. రాయలసీమలోని పెనుగొండ ప్రాంతాన్ని పరిచయం చేస్తూ కనకరాజు వాయిస్ ఓవర్‌తో టీజర్ మొదలైంది. సరదాగా సాగే కనకరాజు జీవితం, ఓ కొరియన్ అమ్మాయిని ప్రేమించిన తర్వాత ఎలా మారింది? అనేది ఈ టీజర్‌లో ఆసక్తికరంగా సాగింది. ఆత్మలు, అతీంద్రియ శక్తుల నేపథ్యంలో కామెడీ, యాక్షన్, ఫాంటసీ హారర్ అంశాలతో ఈ కథ సాగుతుందని టీజర్ చెబుతున్నది. రాయలసీమ గ్రామీణ నేపథ్యాన్ని, కొరియా వాతావరణాన్ని మేళవిస్తూ వినోదాత్మకంగా దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయిక. సత్య కీలక పాత్ర పోషిస్తున్నారు. కెమెరా: మనోజ్ రెడ్డి, సంగీతం: తమన్.

దయ్యాలు వేదాలు వల్లించినట్టు జగన్ తీరు



కార్మికశాఖమంత్రి వాసంశెట్టి సుభాష్

అమరావతి, నవంబర్ 02, ఎక్స్‌ప్రెస్‌టుడే: ‘‘ ఆడలేక మద్దెల ఓడు’’అన్నట్టుగా ఉంది మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరు. ప్రజా మద్దతు సాధించుకోలేని జగన్ ప్రజాస్వామ్య బద్ధంగా జరిగిన పురపాలక ఎన్నికలను కించపరుస్తూ మాట్లాడడం ఆయన అజ్ఞానాన్ని తేట తెల్లం చేస్తున్నది. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకుంటే తన రాజకీయ పునాదులు ఎక్కడ కదులుతాయోనన్న భయం జగన్ ను వెంటాడుతున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. 2024 శాసనసభ ఎన్నికల్లో కూడా చొక్కాను మడత పెడతానంటే ప్రజలు ఆయన సీటునే మడత పెట్టి పదకొండు స్థానాలకే పరిమితం చేసిన సంగతి అందరికి తెలిసిందే. ఇప్పుడు మళ్ళీ మడత పెడతానంటే స్థానిక పోరులో కూడా వైసీపీ అడ్రసు గల్లంతు చేయడమే కాక శాశ్వతంగా ఆ పార్టీని బంగాళాఖాతంలో కలిపేసే పరిస్థితులు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. రాయలసీమలో ఏ సంఘటన జరిగినా దాని వెనుక ఉన్న చారిత్రక నేపథ్యాన్ని చూడాలని శాసనసభలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చెప్పిన మాటలు గుర్తు చేసుకుంటే నేడు జగన్ పై ప్రజలు తిరగబడుతున్న తీరుకు నిదర్శనం. పులివెందులలో నాలుగు దశాబ్దాల అణచివేత, నిరంకుశత్వం, తర్వాత నేడు నిజమైన మార్పు వచ్చిందనడానికి నిన్నటి పుర పోలింగ్ సాక్ష్యం. ప్రజలంతా పండుగ వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించకోవడమంటే కూటమి పాలన పట్ల వారికున్న సంతృప్తికి తార్కణమనే చెప్పాలి.

ప్రజాస్వామ్యం, ఎన్నికల సంఘం అనే మాటలు జగన్ మాట్లాడడం చూస్తే ‘‘దయ్యాలు వేదాలు వల్లించినట్టు’’గా ఉంది. వైసీపీ పాలనలో జరిగిన స్థానిక సంస్థల సమయంలో స్వయంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కే రక్షణ లేక కేంద్ర భద్రత నడుమ పక్క రాష్ట్రంలో తలదాచుకోవాల్సి వచ్చిన సంగతి జగన్ రెడ్డి మరిచిపోయినట్టుగా ఉంది. నాడు స్థానికసంస్థల ఎన్నికల్లో ప్రత్యర్థులను కనీసం నామినేషన్లు కూడా వేయనీయకుండా చేసిన చరిత్ర జగన్ ది. కానీ నేడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ప్రతిపక్షాల వారు కూడా స్వేచ్ఛగా పోలింగ్ ఏజెంట్లుగా కూర్చునే ప్రజాస్వామ్య వాతావరణం నెలకొందని చెప్పడంలో సందేహం లేదు.

ఫ్యాన్ తుక్కు...తుక్కు...!

రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో మాదిరిగానే స్థానిక ఎన్నికల్లోకూడా మరోసారి ఫ్యాన్ తుక్కు తుక్కు కావడం ఖాయంగా ఉంది. రాష్ట్రమంతటా కూటమి అభ్యర్థులు క్లీన్ స్వీప్ చేసే వాతావరణం నెలకొంది. గతంలో వైసీపీ గెలిచిన 11 నియోజకవర్గాల్లో కూడా ఆ పార్టీ తిరోగమనదిశలోనే పయనిస్తున్నది. ఇందుకు ప్రధాన కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలేనని చెప్పవచ్చు. సంక్షేమ ఫలాలు అందుకుంటున్న ప్రజలు నేడు కూటమి ప్రభుత్వానికి తమ ఋణం తీర్చుకుంటున్నారనడానికి నిన్న జరిగన పోలింగ్ శాతమే అందుకు ఉదాహరణ. ఐదేళ్ళపాటు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం జగన్ విషకౌగిలిలో బందీ అయింది. ప్రాధమిక హక్కులను హరించివేశారు. రాష్ట్రానికి జగన్ పాలన ఓ పీడకలలా మిగిలిపోయింది. అది పాలనకాదు పీడన అనే భావనతో ఆ స్మృతులను ఇప్పటికీ ప్రజలు గుర్తు చేసుకుంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమి పార్టీలకే మద్దతుగా నిలిచారడానికి రేపు వెల్లడికాబోయే ఫలితాలే నిదర్శనం. ఏదిఏమైనా స్థానిక పోరు తర్వాత వైసీపీ మునిగిపోయే నావే...

నర్సింగ్ సేవల్లో ఆధునిక అందిపుచ్చుకోవాలి



కర్నూలు, నవంబర్ 02, ఎక్స్‌ప్రెస్‌టుడే: వైద్య రంగంలో నర్సుల సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలులో నిర్వహించిన 79వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ బైయెన్నియల్ కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొని నర్సింగ్ రంగంలో వస్తున్న మార్పులు, నర్సుల సేవల ప్రాధాన్యతపై మాట్లాడారు. కరోనా సమయంలో ప్రజలంతా తమ ప్రాణాలను కాపాడుకోవడానికి ఇళ్లకే పరిమితమైనప్పటికీ, వైద్యులు, నర్సులు మాత్రం ప్రాణాలకు తెగించి రోగులకు సేవలందించారని మంత్రి గుర్తుచేశారు. నర్సులు చూపించే ఓర్పు, సహనం, ఆప్యాయత, సేవాభావం ఎంతో గొప్పవని కొనియాడారు. కొన్ని ఆసుపత్రులకు అక్కడి నర్సులు అందించే నాణ్యమైన సేవలు, రోగుల పట్ల చూపించే ప్రత్యేక శ్రద్ధ కూడా మంచి గుర్తింపును తీసుకొస్తాయని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నర్సులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని, తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ హెల్త్ వంటి సాంకేతికతలను వైద్య సేవల్లో నిర్వహంచుకోవాలన్నారు. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, రోగుల పట్ల మానవీయ విలువలు, ఆప్యాయత, సేవాభావం అత్యంత ముఖ్యమని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో వైద్య రంగ అభివృద్ధికి, నర్సింగ్ సేవల మెరుగుదలకు ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొస్తోందని మంత్రి తెలిపారు. నర్సుల నైపుణ్యాభివృద్ధికి ఇలాంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు.

కర్నూలులో జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన వైద్య, నర్సింగ్ రంగ కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందని, ఇలాంటి కార్యక్రమాలకు కర్నూలు వేదిక కావడం నగరానికి గర్వకారణమని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు డి. ఉషా పన్నగవేణి, ఆంధ్రప్రదేశ్ నర్సెస్ అండ్ మిడ్‌వైఫ్స్ కౌన్సిల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. సుశీల, రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ నర్సింగ్ డాక్టర్ పి. హిమగిరి, కర్నూలు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ ఆర్. పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో చిక్కుకున్న ఏడుగురు మత్స్యకారులు క్షేమం

నెల్లూరు, నవంబర్ 02, ఎక్స్‌ప్రెస్‌టుడే: కావలి నియోజకవర్గం జువ్వలదిన్నె సమీప సముద్రంలో చేపల వేటకు వెళ్లి బోటు ఇంజన్ చెడిపోవడంతో ప్రమాదంలో చిక్కుకున్న ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారులు సమన్వయంతో అప్రమత్తంగా చేపట్టిన రక్షణ చర్యలతో బోటును సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంతో పాటు అందులో ఉన్న ఏడుగురు మత్స్యకారులను క్షేమంగా రక్షించినట్లు వెల్లడించారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు నెల్లూరు సముద్ర తీర ప్రాంతానికి చేరుకున్న సమయంలో సముద్రంలో వాతావరణ మార్పులను గమనించి తిరిగి జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేరుకునేందుకు ప్రయత్నించారు. అయితే మార్గమధ్యంలో బోటు ఇంజన్ చెడిపోవడంతో హార్బర్ మౌత్ పాయింట్‌కు సుమారు అర కిలోమీటరు దూరంలో సముద్రంలోనే నిలిచిపోయారు.

ఈ విషయాన్ని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో విధులు నిర్వహిస్తున్న సర్వైలెన్స్ సిబ్బంది గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. దీంతో మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు అప్రమత్తమై స్థానిక మత్స్యకారుల సహకారంతో రక్షణ చర్యలు ప్రారంభించారు. సముద్రంలో అలల ఉధృతి అధికంగా ఉండటంతో తొలుత బోటు వద్దకు చేరుకోవడం కష్టతరమైంది.

ఈ క్రమంలో బోటుకు వేసిన లంగరు తెగిపోవడంతో సముద్ర అలల ఉధృతికి బోటు పాతకడపాలెం గ్రామం వైపు కొట్టుకుపోయింది. వెంటనే అప్రమత్తమైన మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు, స్థానిక మత్స్యకారులు సమన్వయంతో బోటును అనుసరిస్తూ రక్షణ చర్యలను కొనసాగించారు. చివరకు బోటును పాతకడపాలెం సముద్ర తీరానికి సురక్షితంగా చేర్చి అందులో ఉన్న ఏడుగురు మత్స్యకారులను క్షేమంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. ఈ రక్షణ చర్యల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించి మత్స్యకారుల ప్రాణాలను కాపాడిన మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు, సర్వైలెన్స్ సిబ్బంది, స్థానిక మత్స్యకారులను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. సముద్రంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు మత్స్యకారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, అధికారుల సూచనలు పాటించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

అప్రమత్తత, విధి నిర్వహణలో రైల్వే ఉద్యోగులకు పురస్కారాలు



విశాఖపట్నం, నవంబర్ 02, ఎక్స్‌ప్రెస్‌టుడే: రైళ్ల సురక్షిత రాకపోకలకు విశేష అప్రమత్తత, సమయస్ఫూర్తి, విధి నిర్వహణలో అంకితభావం ప్రదర్శించిన ఆరుగురు రైల్వే ఉద్యోగులకు విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) లలిత్ బోహ్రా జూన్ నుంచి ఆగస్టు 2026 కాలానికి సంబంధించిన డివిజనల్ రైల్వే మేనేజర్ భద్రతా పురస్కారాలను అందజేశారు. డివిజనల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ఆపరేషన్స్) సమక్షంలో ఈ పురస్కారాలను ప్రదానం చేశారు.

పురస్కార గ్రహీతలు మరియు వారి విశేష సేవలు:

1. బి.కె. పవన్ కుమార్, సీనియర్ గూడ్స్ ట్రైన్ మేనేజర్ -- గూడ్స్ రైలు రోలింగ్ పరీక్ష సమయంలో ఒక వ్యాగన్‌లో కాయిల్ స్ప్రింగ్ లేకపోవడాన్ని గుర్తించి, వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు.

2. నూక ఉమామహేశ్వరరావు, సీనియర్ ట్రైన్ మేనేజర్ -- పక్క లైన్‌లో ప్రయాణిస్తున్న రైలుతో సిగ్నల్స్ మార్పిడి సమయంలో పలు వ్యాగన్లు అడాప్టర్లు వాలిన స్థితిలో ఉండటాన్ని గమనించి, వెంటనే సంబంధిత ట్రైన్ మేనేజర్‌కు సమాచారం అందించారు.

3. టి. విజయ కుమార్, లోకో పైలట్ (గూడ్స్) -- రైలు తనిఖీ సమయంలో ఒక వ్యాగన్‌లో పీయూ క్యాప్ విరిగిపోవడం, హెలికల్ స్ప్రింగ్ దెబ్బతినడాన్ని గుర్తించి, సంబంధిత కంట్రోల్ అధికారులకు సమాచారం అందించారు.

4. బత్తుల కోటేశ్వరరావు, సీనియర్ గూడ్స్ ట్రైన్ మేనేజర్ -- పక్క లైన్‌లో కదులుతున్న రైలులో ఒక వ్యాగన్ యాక్సిల్ అడాప్టర్ తీవ్రంగా వాలిన స్థితిలో ఉండటాన్ని గుర్తించి, వెంటనే అధికారులకు తెలియజేశారు. దీంతో క్యారేజ్ అండ్ వ్యాగన్ సిబ్బంది సకాలంలో లోపాన్ని సరిచేశారు.

5. వి.కె. సింగ్, గూడ్స్ ట్రైన్ మేనేజర్ -- రైలులోని వ్యాగన్ల నుంచి ఆయిల్ లీకేజీ కావడం, చివరి బ్రేక్‌వ్యాన్‌లో హ్యాండ్ బ్రేక్ పనిచేయకపోవడాన్ని గుర్తించి, వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు.

6. వరహాల బాబు డొంక, లోకో పైలట్ -- రైలును విధుల్లోకి తీసుకునే సమయంలో ఒక వ్యాగన్‌లో ట్రాలీ సైడ్ బేరర్లు స్థానభ్రంశం చెందినట్లు గుర్తించి, వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేశారు.

ఈ సందర్భంగా డీఆర్ఎం లలిత్ బోహ్రా పురస్కార గ్రహీతలను అభినందిస్తూ, వారి అప్రమత్తత, అంకితభావం, విధి నిర్వహణలో చూపిన బాధ్యతాయుతమైన ప్రవర్తనను ప్రశంసించారు. రైల్వే భద్రతలో ప్రతి స్థాయిలో అప్రమత్తత, లోపాలను సకాలంలో గుర్తించడం, తక్షణమే సంబంధిత అధికారులకు సమాచారం అందించడం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. రైల్వే ప్రమాదాల నివారణకు, రైళ్ల సురక్షిత రాకపోకలకు ఉద్యోగుల్లో భద్రతా స్పృహను మరింత పెంపొందించడంలో ఇటువంటి పురస్కారాలు ప్రోత్సాహకరంగా నిలుస్తాయని విశాఖపట్నం డివిజన్ పేర్కొంది.

తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు విద్యుత్ శాఖ సిద్ధం..

- నెల్లూరు, తిరుపతి జిల్లాలకు ప్రత్యేక బృందాలు
- యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు
- ఎపిఎస్ పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడి



తిరుపతి నవంబర్ 02, ఎక్స్‌ప్రెస్‌టుడే: మురసు తుఫాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో సరఫరాను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో తుఫాను ప్రభావం ఎక్కువగా వుండే నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో చీఫ్ జనరల్ మేనేజర్, డివిజన్ స్థాయిలో జనరల్ మేనేజర్, సబ్-డివిజన్ స్థాయిలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించామన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశం వున్న నెల్లూరు, తిరుపతి సర్కిళ్ళతోపాటు కడప, నంద్యాల జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు కూడా తుఫాను పట్ల అప్రమత్తంగా వుండాలని సూచించారు.

భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో సరఫరాను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించేందుకు వీలుగా సంస్థ పరిధిలోని అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల, కడప, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి అధికారులు, సిబ్బందితో కూడిన 226 ప్రత్యేక బృందాలుగా 2,403 మంది, తమిళనాడు నుంచి కూడా 10 బృందాలు నెల్లూరు, తిరుపతి జిల్లాలకు చేరుకున్నట్లు తెలిపారు. సరఫరా పునరుద్ధరణకు అవసరమైన పరికరాలను, సిబ్బందికి అవసరమైన భద్రతా పరికరాలను, వాహనాలను అందుబాటులో వుంచుకోవాలని సూచించారు. గూడూరులోని డిస్ట్రిక్ట్ స్టోర్ 160 కెవిఏ, 100 కెవిఏ ట్రాన్స్ఫార్మర్లు, కండక్టర్, ఎబి కేబుల్, ఇతర పరికరాలు అందుబాటులో వున్నాయన్నారు. అలాగే యంత్రపు రంపాలు, పోల్ డిగ్గింగ్ మెషీన్లు, క్రేన్లు కూడా సిద్ధంగా వున్నాయని వివరించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుగా సంబంధిత కాంట్రాక్టర్లు కూడా అందుబాటులో వుండే విధంగా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల కారణంగా సంస్థ అధికారులు, సిబ్బందికి సెలవులను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

24/7 పనిచేసే కంట్రోల్ రూమ్లు ఏర్పాటు

సంస్థ పరిధిలో నెల్లూరు, తిరుపతి సర్కిల్స్, కార్పొరేట్ ఆఫీస్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్లను ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడం, లైన్లు తెగిపడడం, స్తంభాలు ఒరిగిపోవడం/ కూలిపోవడం, ట్రాన్స్ ఫార్మర్లు మరమ్మతుకు గురికావడం లాంటి సంఘటనల్ని గుర్తించినట్లయితే ప్రజలు వెంటనే అయా జిల్లాల కంట్రోల్ రూమ్ నంబర్లకు (నెల్లూరు జిల్లా: 94408 17468, తిరుపతి జిల్లా: 94408 17412, కార్పొరేట్ ఆఫీస్: 87124 80430) గాని, టోల్-ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా సంస్థ వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలియజేశారు. వర్షం కురుస్తున్న సందర్భాల్లో ప్రజలు విద్యుత్ స్తంభాలను తాకవద్దని, లైన్ల కింద నిల్చోవద్దని తెలిపారు. అదేవిధంగా గృహాల్లో కూడా ఎటువంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా వినియోగదారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సిఎండి శివశంకర్ లోతేటి ఆ ప్రకటనలో సూచించారు.

‘మురసు’ తుఫాను రాకకు ముందు దక్షిణ తీర రైల్వే అప్రమత్తత

విశాఖపట్నం, నవంబర్ 02, ఎక్స్‌ప్రెస్‌టుడే: దక్షిణ తీర రైల్వే, ప్రమాదానికి గురయ్యే రైల్వే వంతెనలు, పట్టాలు, యార్డులు మరియు సిగ్నలింగ్ వ్యవస్థలపై ఇరవై నాలుగు గంటల నిఘాను ముమ్మరం చేసింది. నీరు నిలిచిపోకుండా నివారించడానికి, క్యాచ్-వాటర్ డ్రెయిన్‌ల నుండి చెత్తచెదారాన్ని తొలగించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రమాదానికి గురయ్యే ప్రదేశాలు, వంతెనల వద్ద పెట్రోల్‌మెన్‌లు మరియు వాచ్‌మెన్‌లను మోహరించారు. అలాగే, అత్యవసర ట్రాక్ నిర్వహణ సామగ్రి తగినంత నిల్వ ఉండేలా చూసుకున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సన్నిహిత సమన్వయం కొనసాగించాలని, వాతావరణ శాఖ జారీ చేసే వాతావరణ హెచ్చరికలను నిరంతరం పర్యవేక్షించాలని జనరల్ మేనేజర్ అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితులకు సత్వర స్పందనను సులభతరం చేయడానికి, మెరుగైన సమన్వయం కోసం దక్షిణ తీర రైల్వే జోనల్ హెడ్ క్వార్టర్ మరియు డివిజనల్ హెడ్ క్వార్టర్స్‌లో 24ఞ7 వార్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రయాణీకుల సహాయం మరియు భద్రతా ఏర్పాట్లను కూడా పటిష్టం చేశారు.

సకాలంలో సమాచారం అందించడానికి ప్రధాన స్టేషన్లలో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే, రద్దయిన రైలు టిక్కెట్లకు (ఏవైనా ఉంటే) రీఫండ్‌లను సులభతరం చేయడానికి అదనపు కౌంటర్లను కూడా నిర్వహిస్తారు. క్యాటరింగ్ యూనిట్లకు తగినంత ఆహార నిల్వలను నిర్వహించాలని సూచించారు, మరియు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఏర్పాట్లు కూడా చేశారు.

ఇరవై నాలుగు గంటల అత్యవసర సహాయం కోసం వైద్య బృందాలు, ప్రథమ చికిత్స సౌకర్యాలు మరియు అంబులెన్సులు సిద్ధంగా ఉంచబడ్డాయి. పౌర రక్షణ సిబ్బంది మరియు స్కౌట్స్ & గైడ్స్ వాలంటీర్లను అప్రమత్తం చేశారు. అవసరమైతే ప్రత్యేక రైళ్లను నడపడానికి రైల్వే సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.

2-11-26న విజయవాడ నుండి బయలుదేరాల్సిన రైలు నెం. 67225 (విజయవాడ - గూడూరు) ప్యాసింజర్ రైలు రద్దు చేయబడింది. 3-11-26న గూడూరు నుండి బయలుదేరాల్సిన 67226 నంబర్ (గూడూరు-విజయవాడ) ప్యాసింజర్ రైలు రద్దు చేయబడింది. 3-11-26న గూడూరు నుండి బయలుదేరాల్సిన రైలు నం. 12743 (గూడూరు - విజయవాడ) ఎక్స్‌ప్రెస్ రద్దు చేయబడింది. 2-11-26న గుంటూరు నుండి బయలుదేరాల్సిన రైలు నం. 67235 (గుంటూరు - తెనాలి) ప్యాసింజర్ రైలు రద్దు చేయబడింది. 3-11-26న తెనాలి నుండి బయలుదేరాల్సిన రైలు నం. 67236 (తెనాలి - గుంటూరు) ప్యాసింజర్ రైలు రద్దు చేయబడింది. చేయబడింది. 3-11-26న రేపల్లె నుండి బయలుదేరాల్సిన రైలు నం. 67238 (రేపల్లె - మార్కాపురం) ప్యాసింజర్ రైలు రద్దు చేయబడింది. 3-11-26న మార్కాపురం నుండి బయలుదేరాల్సిన రైలు నం. 67239 (మార్కాపురం - తెనాలి) ప్యాసింజర్ రైలు రద్దు చేయబడింది.

గ్రామస్థాయిలో వివాదాల పరిష్కారానికి కమ్యూనిటీ మధ్యవర్తిత్వం

కడప నవంబర్ 02, ఎక్స్‌ప్రెస్‌టుడే: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జి. రామగోపాల్ సూచనలతో రైల్వే కోడూరు మండలం, కె.బుడుగుంటపల్లెలో సోమవారం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ మధ్యవర్తిత్వం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు న్యాయ సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో వారి గ్రామాలలో ఉండే వ్యక్తులను కమ్యూనిటీ మధ్యవర్తులుగా నియమించామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల మధ్య తలెత్తే చిన్న చిన్న వివాదాలు, కుటుంబ సమస్యలు, భూ సంబంధిత వివాదాలు, ఆస్తి తగాదాలు, ఇతర సామాజిక సమస్యలను పరస్పర చర్చలు, అవగాహన ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కమ్యూనిటీ మధ్యవర్తిత్వం ద్వారా కోర్టులకు వెళ్లకుండానే స్థానిక స్థాయిలోనే వివాదాలను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని, దీనివల్ల సమయం, డబ్బు ఆదా కావడమే కాక ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలు, సామాజిక ఐక్యత పెంపొందుతాయని తెలియజేశారు. ప్రజలందరూ కమ్యూనిటీ మధ్యవర్తిత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శాశ్వత లోక్ అదాలత్, జాతీయ లోక్ అదాలత్, ఎల్.యస్.యు.సి, ఎల్.యస్.యు.యం మొదలగు అంశాలను వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించారు. ఏవైనా సమస్యలుంటే రైల్వే కోడూరు మండల న్యాయ సేవా సమితిని, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన కమ్యూనిటీ మధ్యవర్తులు డి. చంద్ర శేఖర్, బి. గంగయ్య, ఆర్. విజయ్ కుమార్ లకు సెక్రటరీ వారు సర్టిఫికెట్స్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన మధ్యవర్తులు ఏ. సుబ్రమణ్యం, బి . నాగమల్లిక్, ఎన్. శంకరయ్య మరియు ఎన్. మూకాంబిక, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఏం. శాంత, కోర్ట్ సిబ్బంది, శిక్షణ పొందిన కమ్యూనిటీ మధ్యవర్తులు, పారా లీగల్ వాలంటీర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.



కేంద్ర సాయం త్వరగా అందేలా చూడండి



- అర్నబ్ తుఫాను నష్టంపై కేంద్ర బృందానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
- రాష్ట్రంలో రూ.4,526 కోట్ల నష్టం.. ఇప్పటికే కేంద్రానికి నివేదిక
- నాలుగు జిల్లాల్లో పంట నష్టాన్ని పరిశీలించిన కేంద్ర బృందం
- సహాయక, పునరుద్ధరణ చర్యలపై ప్రభుత్వ పనితీరుకు ప్రశంసలు

అమరావతి, నవంబర్ 02, ఎక్స్‌ప్రెస్‌టుడే: అర్నబ్ తుఫాను వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. తుఫాను కారణంగా ప్రాథమిక అంచనా ప్రకారం రూ.4,526 కోట్ల నష్టం వాటిల్లిందని, దీనిపై ఇప్పటికే కేంద్రానికి నివేదిక సమర్పించినట్లు తెలిపారు. నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర బృందం సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో ముఖ్యమంత్రితో సమావేశమైంది. కేంద్ర హోం, వ్యవసాయ, జలవనరులు, జాతీయ రహదారులు, ఆర్థిక శాఖలకు చెందిన అధికారులు బృందంలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నివేదిక సమర్పించిన వెంటనే కేంద్ర బృందాన్ని పంపినందుకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయిలో నష్టాన్ని సమగ్రంగా పరిశీలించి, త్వరగా సిఫార్సులు పంపాలని కోరారు. కోనసీమ, పశ్చిమగోదావరి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించి నష్టాన్ని పరిశీలించినట్లు కేంద్ర బృందం సభ్యులు సీఎంకు వివరించారు. వరి, కొబ్బరి, అరటి పంటలకు తీవ్ర నష్టం జరిగినట్లు గుర్తించామని తెలిపారు. ముఖ్యంగా పంట చేతికి వచ్చే సమయంలో తుఫాను రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. వ్యవసాయంతో పాటు ఉద్యాన, ఆక్వా రంగాలకూ నష్టం వాటిల్లిందని చంద్రబాబు వివరించారు. మత్స్యకారుల పడవలు దెబ్బతిన్నాయని చెప్పారు.

ఓవైపు కరువు.. మరోవైపు తుఫాన్లు..

అర్నబ్ తుఫాను నష్టం నుంచి రాష్ట్రం కోలుకోకముందే మురను తుఫాను ముంచుకొస్తోందని సీఎం తెలిపారు. గతంలో హుద్‌హుద్, తిత్లీ, మోంథా తుఫాన్లు రాష్ట్రానికి తీవ్ర నష్టం కలిగించాయని గుర్తు చేశారు. ప్రస్తుతం ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొనగా, మరోవైపు తుఫాన్ల ముప్పు ఎదురవుతోందన్నారు. కరువు పరిస్థితులను తట్టుకునేందుకు ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని, ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని చెప్పారు. ఆర్టీజీఎస్, వాట్సాప్ మనమిత్ర వంటి వ్యవస్థల ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగామని వివరించారు. ఈ విధానాలు ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శమని, వాటిని సిఫార్సు చేస్తామని కేంద్ర బృందం తెలిపింది. తుఫాను కారణంగా విద్యుత్, రహదారులు సహా మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని చంద్రబాబు తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు 7 వేల మంది సిబ్బందితో పనులు చేపట్టినట్లు వెల్లడించారు. పునరావాసం, సహాయక చర్యలు, పునరుద్ధరణ పనులను ఆర్టీజీఎస్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. సాధారణ పరిస్థితులను త్వరగా పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను కేంద్ర బృందం ప్రశంసించింది. విద్యుత్, రహదారుల పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టడం అభినందనీయమని పేర్కొంది. మారుమూల ప్రాంతాల్లోనూ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపింది.

అమెరికాలో భారతీయులు నిరసన చేస్తే ఊరుకుంటారా?

ఇమ్రాన్ ఖాన్‌కు కోర్టు మందలింపు



న్యూఢిల్లీ, నవంబర్ 02, ఎక్స్‌ప్రెస్‌టుడే: ప్రముఖ నటుడు ఆమిర్ ఖాన్ మేనల్లుడు, ఎన్నికల సంఘానికి (ఈసీ) వ్యతిరేకంగా నిరసనల్లో పాల్గొన్న నటుడు ఇమ్రాన్ ఖాన్‌పై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అమెరికా పౌరసత్వం కలిగిన ఆయన.. నవంబర్ 14లోగా భారత్ విడిచి వెళ్లాలని ఇటీవల ఫారిన్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఖీ==నా) నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, వీటిని సవాలు చేస్తూ ఇమ్రాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం .. ఈసీకి వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీల్లో పాల్గొన్నందుకు తీవ్రంగా మందలించింది. ఆయన ఓవర్‌సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ూజ×) కార్డు కలిగిన అమెరికన్ పౌరుడని..కాబట్టి భారత పౌరుడిలా వ్యవహరించే హక్కు లేదని పేర్కొంది.

అమెరికాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓ భారత పౌరుడు నిరసన తెలిపితే ఊరుకుంటారా అని ప్రశ్నించింది. అలా చేసిన భారతీయులను వెంటనే ఫ్లైట్ ఎక్కించి మరీ వెనక్కి పంపించేసేవారని కోర్టు వ్యాఖ్యానించింది. ర్యాలీల్లో పాల్గొన్న విషయంపై మీరు కోర్టుకు స్పష్టమైన హామీ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంది. 'చాలా ఏళ్లుగా భారత్‌లో ఉండడం వల్ల మీరు భారతీయుడు కాదనే విషయాన్ని మరిచిపోయి ఉంటారు. కానీ మీరు ఓసీఐ కార్డుదారు. కాబట్టి భారత పౌరుడిలా వ్యవహరించలేరు. సర్ ప్రక్రియ గురించి మాట్లాడటానికి.. దానికి వ్యతిరేకంగా జరిగే ఆందోళనల్లో పాల్గొనడానికి మీకు ఎటువంటి హక్కు లేదు. మీ జీవితంలో ఎక్కువ భాగం భారత్‌లోనే గడిపానని చెబుతున్నారు. బాలీవుడ్‌లో నటుడిగా స్థిరపడ్డారు. అయినా కూడా ఎందుకు ఇంకా భారత పౌరసత్వాన్ని స్వీకరించట్లేదు?" అని ధర్మాసనం ఇమ్రాన్‌ను ప్రశ్నించింది.

క్షమాపణలు చెప్పిన ఇమ్రాన్..

సీఈసీకి వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్నందుకు ఇమ్రాన్ ఖాన్ బాంబే హైకోర్టుకు బేషరతుగా క్షమాపణలు చెప్పారు. తాను అమెరికాలో జన్మించి, పుట్టుకతోనే అక్కడి పౌరసత్వం పొందినప్పటికీ.. తన జీవితమంతా భారత్‌లోనే గడిపానని పేర్కొన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న ఏ నిరసన సంస్థతో గానీ, వ్యక్తులతో గానీ తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనబోనని హామీ ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. భవిష్యత్తులో ఇలాంటి కార్యకలాపాలలో పాల్గొనడానికి క్షమాపణను అనుమతిగా భావించవద్దని స్పష్టం చేసింది. సెలబ్రిటీ హోదాలో ఉన్న వారి మాటలకు అభిమానులు, ప్రజలు ఆకర్షితులవుతారని పేర్కొంది. విదేశీయుల పట్ల భారత దేశ వైఖరి గురించి ప్రస్తావిస్తూ.. ఇక్కడి ప్రజలు 'వసుధైవ కుటుంబం' సూత్రాన్ని విశ్వసిస్తారని తెలిపింది. అయినప్పటికీ ఓసీఐ కార్డుదారులు భారత పౌరులకు కేటాయించిన రాజకీయ హక్కులను వినియోగించుకోలేరని పునరుద్ఘాటించింది. తదుపరి విచారణను డిసెంబర్ 7వ తేదీకి వాయిదా వేసింది. అప్పటి వరకు 'లీవ్ ఇండియా నోటీసు' గడువును పొడిగిస్తున్నట్లు తెలిపింది.

భక్తులకు అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు



తిరుమల నవంబర్ 02, ఎక్స్‌ప్రెస్‌టుడే: తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అన్నప్రసాదాల పంపిణీకి అంతరాయం లేకుండా, క్యూలైన్లు బయటకు రాకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు.

ఈ మేరకు సోమవారం తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో గల సుధర్మ సమావేశ మందిరంలో టీటీడీలోని వివిధ విభాగాల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించడంతో పాటు, వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు వీలైనంత త్వరగా దర్శనం కల్పించాలని, సాధ్యమైనంత వరకు క్యూ లైన్లు వెలుపలకు రాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వర్షాల కారణంగా అన్నప్రసాదాల పంపిణీకి ఎక్కడా అంతరాయం కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో టార్పాలిన్లు ఏర్పాటు చేసి భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందించాలని సూచించారు. భక్తులు వసతి గదులు, కంపార్ట్‌మెంట్లలో సురక్షితంగా ఉండేలా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని విద్యుత్, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఘాట్ రోడ్లలో వర్షాల కారణంగా చిన్న చిన్న రాళ్లు పడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని, డౌన్ ఘాట్, అప్ ఘాట్ రోడ్లలో భద్రతా చర్యలు పటిష్టం చేయాలని సూచించారు.

వర్షాల సమయంలో భక్తులు నడిచేటప్పుడు జారిపడి గాయపడే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి, అవసరమైన వారికి తక్షణ వైద్య సహాయం అందించాలని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. భక్తులందరూ సురక్షితంగా, సులభంగా శ్రీవారి దర్శనం చేసుకుని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ స్వస్థలాలకు తిరిగి వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో టీటీడీ చీఫ్ ఇంజినీర్ మనోహరం, ఎస్ఇ వేణుగోపాల్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కుసుమకుమారి, అన్నప్రసాదం డెప్యూటీ ఈవో రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు

ప్రశాంతంగా గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలు



- ప్రశాంతంగా గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలు
- ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్, సీసీటీవీ నిఘా ఉండాలి
- నంద్యాల జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి

నంద్యాల నవంబర్ 02, ఎక్స్‌ప్రెస్‌టుడే: గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, గ్రామీణ ఎన్నికల్లో ఎలాంటి చిన్నపాటి లోపాలకు కూడా తావులేకుండా ఎంపీడీవోలు, రిటర్నింగ్ అధికారులు, జోనల్ అధికారులు ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం నుంచి గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల సంసిద్ధతపై జేసీ సూరజ్ ధనుంజయ్ తో కలిసి టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి మాట్లాడారు.

పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందికి సౌకర్యవంతమైన ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి కేంద్రంలో నిరంతర విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, తాగునీరు, రన్నింగ్ వాటర్‌తో కూడిన పరిశుభ్రమైన మరుగుదొడ్లు అందుబాటులో ఉండాలని, పోలింగ్ కోసం ఎంపిక చేసే గదులు శుభ్రంగా, సౌకర్యవంతంగా ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లు, వెబ్‌కాస్టింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి సమయానికి నాణ్యమైన అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం అందించాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే సిబ్బందికి రిసెప్షన్ కేంద్రాల్లో అవసరమైన వసతి కల్పించడంతో పాటు, విధుల ధ్రువీకరణ పత్రాలు, గౌరవ వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని సూచించారు.

ఓటింగ్ ప్రక్రియలో అప్రమత్తత

ఓటర్లు ఓటరు స్లిప్‌తో పాటు ప్రభుత్వం గుర్తించిన ఫొటో గుర్తింపు కార్డును తీసుకువచ్చేలా ముందస్తు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఓటింగ్‌కు ఉపయోగించే స్వస్తిక్ మార్క్ స్టాంపుల నాణ్యతను ముందుగానే తనిఖీ చేయాలని, స్టాంప్ ప్యాడ్లు సక్రమంగా పనిచేసేలా చూడాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం కారణంగా పోలింగ్‌కు అంతరాయం కలగకుండా ప్రిసైడింగ్ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఏపీఎస్ఆర్టీసీ, రవాణా శాఖలతో జెడ్పీ సీఈఓ సమన్వయం చేసుకోవాలని, బస్సులు, ఇతర వాహనాల రూట్లు, పార్కింగ్ ప్రాంతాలను ముందుగానే నిర్ధారించాలన్నారు. బ్యాలెట్ బాక్సులతో కూడిన వాహనాలు రహదారులపై ఎక్కువసేపు నిలిచిపోకుండా పోలీసు, జోనల్ అధికారుల సమన్వయంతో సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని స్పష్టం చేశారు.

వెబ్‌కాస్టింగ్, సీసీటీవీతో నిరంతర పర్యవేక్షణ

సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ, వెబ్‌కాస్టింగ్ సదుపాయాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అందులో భాగంగా సుమారు 400 పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, మిగిలిన 800కు పైగా కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, పోలింగ్ సమయంలో ఏవైనా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

జడ్పీటిసి ఎంపీటీసీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



అనకాపల్లి, నవంబర్ 02, ఎక్స్‌ప్రెస్‌టుడే: జిల్లాలో జడ్పీటిసి ఎంపీటీసీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణ సోమవారం ఉదయం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పీటిసి ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ తదితర వివరాలను తెలియజేశారు. అనకాపల్లి, బుచ్చయ్యపేట, కసింకోట, మునగపాక, పరవాడ మరియు సబ్బవరం మండలాలకు సంబంధించి ఏ. ఎం. ఏ. ఎల్. కాలేజ్ , కొత్తూరు విలేజ్, అనకాపల్లి నందు రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చోడవరం మండలానికి సంబంధించి గవర్నమెంట్ హై స్కూల్ , గంది గ్రామం, చోడవరం మండలం నందు రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవరపల్లి మరియు కె కోటపాడు మండలాలకు సంబంధించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం (బాయ్స్), తెనుగు పూడి దేవరపల్లి మండలం నందు రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నక్కపల్లి మండలానికి సంబంధించి గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ నక్కపల్లి నందు, పాయకరావుపేట మరియు ఎస్ రాయవరం మండలాలకు సంబంధించి జిల్లా పరిషత్ హై స్కూల్, నక్కపల్లి నందు రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాకవరపాలెం, నర్సీపట్నం మరియు రోలుగుంట మండలాలకు సంబంధించి డాన్ బాస్కో స్కూల్, పెద్ద బొడ్డేపల్లి నందు, కోటవురట్ల, గొలుగొండ, నాతవరం మరియు రావికమతం మండలాలకు సంబంధించి గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నర్సీపట్నం నందు రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వి. మాడుగుల మరియు చీడికాడ మండలాలకు సంబంధించి సెంటెన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ , విమాడుగుల నందు రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అచ్యుతాపురం మరియు రాంబిల్లి మండలాలకు సంబంధించి ఇండోర్ స్టేడియం ఎలమంచిలి నందు ఎలమంచిలి మండలానికి సంబంధించి గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, ఎలమంచిలి నందురిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సత్యనారాయణ తెలిపారు.

'మురసు'తో జాగ్రత్త

చిత్తూరు నవంబర్ 02, ఎక్స్‌ప్రెస్‌టుడే: మురసు తుఫాను ప్రభావంతో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని డీఆర్ఓ మోహన్ కుమార్ ఆదేశించారు. తుఫాను ముప్పుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్‌తో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం, సోమవారం కలెక్టరేట్ నుండి జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులతో డిఆర్ఓ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ముందస్తు రక్షణ చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ప్రజల భద్రతకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు చెరువులు, కాలువలకు గండి పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అత్యవసర మరమ్మతులకు సిద్ధంగా ఉండాలని డిఆర్ఓ ఆదేశించారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిన సందర్భాల్లో తక్షణ చర్యలు చేపట్టేందుకు అగ్నిమాపక శాఖ అవసరమైన చైన్‌సా కట్టర్లతో సిద్ధంగా ఉండాలన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడిన వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు విద్యుత్ శాఖ అధికారులు ముందస్తుగా స్తంభాలను సిద్ధంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు.

సహాయక చర్యలు ... పునరావాసం

పౌరసరఫరాల శాఖ నిత్యావసర వస్తువులను తగినంత నిల్వ ఉంచుకోవాలని, ముంపు గురైన ప్రాంతాల్లో ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాల్లో నిరాశ్రయులకు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ తాగునీటి సరఫరాకు, పోలీస్ శాఖ ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజల భద్రతకు అవసరమైన సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఎలాంటి ప్రాణ, పశు నష్టం జరగకుండా అన్ని ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని డిఆర్ఓ ఆదేశించారు. మండల స్థాయిలో ఆర్డీఓలు, తహసీల్దార్లు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. చిత్తూరు కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్ 08572 242733 ఏర్పాటు చేశామని, అత్యవసర సహాయం లేదా సమాచారం కోసం ప్రజలు ఈ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజలందరూ వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలు, అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

జిల్లాలో వర్షపాతం వివరాలివీ...

గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 17 మండలాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షం కురిసింది. మండలాల వారీగా నమోదు అయిన వర్షపాతం వివరాలను పరిశీలిస్తే... అత్యధికంగా బిరాలలో 19.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత పూతలపట్టులో 12.4 మి.మీ, తవణంపల్లిలో 10.8 మి.మీ, చిత్తూరు అర్బన్‌లో 8.6 మి.మీ, పులిచెర్లలో 8.4 మి.మీ, బంగారుపాలెంలో 8.2 మి.మీ, నగరిలో 6.8 మి.మీ, నింద్రలో 6.2 మి.మీ వర్షపాతం పడింది. అలాగే రొంపిచర్లలో 5.6 మి.మీ, విజయపురంలో 5.2 మి.మీ, గంగవరంలో 3.6 మి.మీ, గంగాధర నెల్లూరులో 3.4 మి.మీ, పలమనేరులో 2.6 మి.మీ వర్షపాతం నమోదు కాగా... పెనుమూరు, ఎస్.ఆర్. పురం, బైరెడ్డిపల్లి మండలాల్లో తల్ 2.4 మి.మీ, పాలసముద్రంలో 2.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

Published and Owned by Sashi B.S.S., D. No.: # 5, 2nd Floor, KSR Complex, 48 Bus Stop Jn., Dondaparthi, Visakhapatnam- 530 016, A.P., Printed by Sashi B.S.S., Printed at Vijayabhanu Publications Pvt. Ltd., D.No.9-3-17, Pithapuram Colony, Visakhapatnam-530 003, Andhra Pradesh. and
Published from # 5, 2nd Floor, KSR Complex, 48 Bus Stop Jn., Dondaparthi, Visakhapatnam- 530 016, A.P. Editor Sashi B.S.S., RNI No.APTEL/2015/64969, Ph: 8008038889. email: expresstodaydaily@gmail.com, Postal Regd.No.VSP/239/2018-2020